కేఎంసీకి ఉద్యానవన అధికారి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 12: పచ్చదనంలో ఇప్పటికే గ్రీన్‌సిటీగా ఖమ్మం అవార్డులను కైవాసం చేసుకొంది. భవిష్యత్‌లో మరింత పచ్చదనంతో ఖమ్మం నగరం ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. ఖమ్మం నగర పాలక సంస్థలో మొక్కలు నాటడం, సంరక్షణకు ప్రత్యేకంగా ఓ అధికారి ఉండాలని భావించారు. గత సమావేశంలోనే ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి ఖమ్మం నగరపాలక సంస్థలో ఉద్యానవనశాఖ అధికారిగా రానున్నారని సమాచారం.



ఖిల్లాపైనుంచి నగరాన్ని చూస్తున్న నేతలు, నేలకొండపల్లి బౌద్ధస్థూపాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు జూపల్లి, పొంగులేటి, ఎంపీ, కలెక్టర్

ఉమ్మడి జిల్లాలో
పర్యాటక అభివృద్ధికి కృషి

- ఖమ్మం ఖిల్లాపై రోప్‌వేకు రూ.30కోట్లు
- నేలకొండపల్లి బౌద్ధస్థూపానికి మరింత గుర్తింపు
- టూరిజం ప్రమోషన్‌కు ప్రతినెలా కుటుంబంతో మంత్రుల టూర్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, జూపల్లి, పొంగులేటి
- ఖమ్మం జిల్లాలో పర్యాటక క్షేత్రాల పరిశీలన

ఖమ్మం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాను పర్యాటక రంగంలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలుపుతామని, ఇందుకు ఎన్ని నిధులైనా కేటాయిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయశాఖ తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో సోమవారం మంత్రుల బృందం పర్యటించింది. మండే ఎండను సైతం లెక్క చేయకుండా మంత్రులు, ఎంపీ రఘురాంరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరారవు, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహార, కార్పొరేటర్ కమర్తపు మురళి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు ఖమ్మం ఖిల్లాపైకి ఎక్కి పురాతన కట్టడాలను తిలకించారు. ఖిల్లాలో కాకతీయులనుంచి నిజాం రాజుల వరకు సాగిన పరిపాలన విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు నేలకొండపల్లి బౌద్ధస్థూపం, భక్తరామదాసు నివాసంతో పాటు ఉమ్మడి జిల్లాలో పలు పర్యాటక ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు వేర్వేరుగా పలుచోట్ల మాట్లాడారు.

ఖమ్మం ఖిల్లాపై జరిగిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రపంచ పర్యాటకరంగంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు భారీగా నిధులు ఖర్చు

(మిగతా 6వ పేజీలో)

రిమోట్ ఏరియాలో ప్రశాంతంగా..

కిన్నెరసాని జలాశయంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, తుమ్మల, జూపల్లి బోట్ షికార్

- పర్యాటక అభివృద్ధిపై బోట్‌లోనే సమీక్ష
- 500మంది పోలీసు పహారా

పాల్వంచ రూరల్/కొత్తగూడెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రిమోట్ ఏరియాలో రిలాక్స్‌డ్‌గా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, అధికారులు బోట్‌షికార్ చేస్తూ టూరిజం అభివృద్ధిపై సమీక్ష చేశారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయంలో సోమవారం డిప్యూటీ సీఎం భట్టితో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు బోటులో విహరిస్తూ సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాంతం మొదటి నుంచి నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా పేరుంది. దీంతో డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటిస్తున్న నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జలాశయం చుట్టూ అటవీ ప్రాంతంలో 500మంది పోలీసులను నియమించారు. గ్రేహౌండ్స్ ఆర్మ్‌డ్ బలగాలు చుట్టూ పహారా కాశాయి. పర్యాటక కేంద్రం ముఖద్వారం నుంచి బోటుషికార్ వరకు స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించగా అద్దాలమేడ వైపు ఉన్న ఫారెస్ట్‌లో ప్రత్యేక బలగాలను బందోబస్తుకు పెట్టారు. గతంలో ప్రజాప్రతినిధులకు ఇక్కడి అద్దాల మేడ విడిదిగా మారిందని, నక్సల్స్ అద్దాలమేడను బ్లాస్టింగ్ చేశారు. ఆ తర్వాత ఇటీవల పక్క మండలంలోని గుండాల దామరతోగులో మావోయిస్టు అశోక్ ఎన్‌కౌంటర్ కావడంతో పోలీసు అప్రమత్తమయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టూరిజం శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు కిన్నెరసాని పర్యాటక కేంద్రంకు



బోటులో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు

రావడంతో గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. బందోబస్తు మధ్య డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రశాంత వాతావరణంలో పర్యటన చేశారు. ప్రత్యేకంగా జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, పాల్వంచ డీఎస్పీ సతీష్, సీఐ వినయ్‌లు కిన్నెరసాని జలాశయం 4కిలోమీటర్ల చుట్టూ పోలీసు బలగాలను మోహరించారు. మంత్రుల పర్యటన సాయంత్రం వరకు కొనసాగింది.

రెండున్నర గంటలు బోటులోనే సమీక్ష..

కిన్నెరసాని టూరిజం అభివృద్ధి కోసం తగు ప్రణాళికలను రూపొందించేందుకు సమీక్షించుకుంటూ డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు రెండున్నర గంటలపాటు బోటులోనే కలియతిరిగారు. ఆనందద్వీపం వద్ద బోటులో మధ్యాహ్న భోజనం చేశారు. కిన్నెరసాని జలదృశ్య భవనం నుంచి ఆనందద్వీపం వరకు రోప్‌వే వంతెన నిర్మిస్తే పర్యాటకులకు ఆహ్లాదంగా ఉంటుందని అధికారులతో చర్చించారు. ద్వీపంలో హోటల్స్, కాటేజీలను నిర్మించడం వల్ల పచ్చని ప్రకృతి ఆస్వాదిస్తూ పర్యాటకులు ఎక్కువ సమయాన్ని కేటాయించే అవకాశం ఉందన్నారు. నూతనంగా నిర్మిస్తున్న అద్దాల మేడను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు చూడాలన్నారు. అదేవిధంగా ఇక్కడ నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని టూరిజం అధికారులను ఆదేశించారు. జలాశయంలో బోటులో తిరుగుతూ అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం కిన్నెరసాని జింకల పార్కుకు చేరుకున్నారు. ఈ పర్యటన ఆద్యంతం జలాశయంలోనే కొనసాగింది.



రివర్స్‌తోనే వైరాకు
గోదావరి జలాలు

- ఎన్నెస్పీ కాల్వలో 13 కిలోమీటర్లు వ్యతిరేక దిశలో పయనం
- ఎస్కేప్ లాకుల ద్వారా నిమ్మవాగులోకి విడుదల
- అక్కడినుంచి 23 కిలోమీటర్లు పయనించి రిజర్వాయర్‌కు..
- తీవ్ర కృషిచేస్తున్న ప్రభుత్వం, ఇంజనీరింగ్ అధికారులు

6

ముమ్మరంగా క్రాప్ బుకింగ్

- క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల సర్వే
- ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఫొటోలతో అప్‌లోడ్
- సర్వే నంబర్ల ప్రకారం జియో ట్యాగింగ్
- ఇప్పటి వరకు 86,607 ఎకరాల వివరాలు సేకరణ
- వానాకాలం సాగు లక్ష్యం 2.42 లక్షల ఎకరాలు
- ఇప్పటి వరకు సాగైంది 1.95 లక్షల ఎకరాలు

6



తరగతి గదిలోనే సామగ్రి పెట్టుకుని నేలపై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

వసతి.. దుస్థితి

- ఇరుకైన గదుల్లో ఇబ్బందుల మధ్య చదువులు
- శిథిలావస్థలో భవనాలు.. మురుగుతో సవాసం
- అనారోగ్యంతో విద్యార్థులు.. అయినా పట్టని అధికారులు
- ఉమ్మడి జిల్లాలో సమస్యల వలయంలో గురుకులాలు



గుండాల మండలంలో ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో వాటర్‌ట్యాంకులో పాకురుతో అపరిశుభ్రంగా ఉన్న నీరు

'తరగతి గదికి సరిపడా మాత్రమే విద్యార్థులుండాలి.. గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలి, వసతి గదులు విశాలంగా ఉండాలి.. అలాంటి వెసులుబాటు కల్పించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించగలుగుతాం" అనే మాటలు కేవలం విద్యాచట్టంలో అక్షరాలకు మాత్రమే పరిమిత మవుతున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు పాలకులు పట్టించుకోవడంలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు గురుకులాల నిర్వహణ తీరు ఈ ఆరోపణలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలు వందకుపైగా నిర్వహిస్తుండగా వాటిల్లో సగానికిపైగా గురుకులాల్లోని విద్యార్థులు సమస్యలతోనే సహవాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పలు గురుకులాలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా కుప్పలు తెప్పలుగా సమస్యలు బయటికొచ్చాయి.

6

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



అధికారులతో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

వైరా, ఆగస్టు 12: వైరాలో 15న నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి రైతు సభ ఏర్పాట్లను సోమవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సందర్శించి పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ఈ సభకు రానుండటంతో సభాస్థలంలో ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్ల గురించి జిల్లా అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్న స్టాల్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సభలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యా, ఖమ్మం ఆర్డీవో గణేష్, అధికారులు పాల్గొన్నారు.

ఉల్లి ధరలకు రెక్కలు...

- కిలో రూ.60కి చేరిన ధర
- బెంబేలెత్తుతున్న ప్రజలు



ఖమ్మం మార్కెట్, ఆగస్టు 12: ఉల్లిగడ్డల ధరలు రోజు రోజుకూ పెరుగుతూ వినియోగదారుల కంట కన్నీరు తెప్పిస్తున్నాయి. గత రెండు నెలలుగా కిలో రూ. 40- 45లుగా నిలకడగా ఉన్న ధరలు ఒక్క సారిగా భగ్గుమన్నాయి. బహిరంగ మార్కెట్‌లో సోమవారం కిలో రూ.50లు నుంచి రూ.60లకు చేరుకున్నాయి. దీంతో వినియోగదారులు బెంబేలెత్తిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో సాధారణంగా ఉల్లి ధరలు పెరుగుతుంటాయి. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ధరలు పెరుగుతాయని వ్యాపార నిపుణులు పేర్కొంటున్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఉల్లి ధరలను కట్టడి చేసేందుకు పటిష్టమైన చర్యలు సైతం తీసుకుంది. ఉల్లిని ఎక్కువగా పండించే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో రైతుల దగ్గర్నుంచి భారీగా ఉల్లిని సేకరించి నిల్వ చేసింది. అంతే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతులు సైతం నిలిపి వేసింది. ఉల్లి తలసరి వినియోగం రోజు రోజుకూ పెరగడంతో పాటు గతేడాది వర్షాభావంతో ఉల్లి ఎక్కువగా పండించే మహారాష్ట్రలో దిగుబడులు తగ్గడం తదితర కారణాలతో ధరలు పెరుగుతున్నాయి. ఉల్లి ధరలు మళ్లీ కొత్త పంట వచ్చే వరకు పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఉల్లి ధరల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప ధరలు ఇప్పట్లో తగ్గేలా లేవు.

ఆపరేషన్.. ఆపరేటర్స్

ధరణి పోర్టల్ లోపభూయిష్టంగా ఉండటంతో వందల ఎకరాల భూ లావాదేవీలు స్తంభించాయి. రికార్డుల్లో చేరిన తప్పులు సరిదిద్దుకునేందుకు, భూ హక్కులు పొందేందుకు వందలాది మందిని క్షోభకు గురి చేశాయి. ఏళ్లకొద్ది కార్యాలయాలు చుట్టు తిరిగేలా చేశాయి. సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను ఆసరాగ చేసుకొని కొందరు ఆపరేటర్లు అధికారులకు తెలియకుండా చక్రం తిప్పారు. వారి సంతకాలను హ్యాక్ చేసి నేరుగా ధ్రువీకరణ పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు యథేచ్ఛగా జారీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దమ్మపేట, అశ్వారావుపేట, బూర్గంపహాడ్, దుమ్ముగూడెం మండలాల్లో ఎక్కువగా ఇలాంటి అక్రమ లావాదేవీలు జరిగినట్టు అధికారులు అనుమానిస్తున్నారు.

- ధరణిలో హైదరాబాద్ కేంద్రంగా దందా
- డిజిటల్ సంతకాలతో అక్రమంగా భూ రికార్డుల మార్పిడి?
- యథేచ్ఛగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు, పాస్ పుస్తకాల జారీ
- ఓ ధ్రువీకరణ పత్రం విషయంలో అశ్వారావుపేటలో వెలుగులోకి

అశ్వారావుపేట, ఆగస్టు 12: అశ్వారావుపేట మండలంలో నారం వారిగూడేనికి చెందిన ఓ ఫ్యామిలీ సర్టిఫికేట్ విషయంలో బాధితుల ఫిర్యాదుతో ధరణి ఆపరేటర్ల విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడు ఫ్యామిలీ పత్రంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తమకు తెలియకుండా ఏ విధంగా జారీ అయిందని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో లోతైన విచారణ జరిపితే ఈ ధ్రువీకరణ పత్రం ఆ అధికారికి సంబంధం లేకుండానే జారీ అయినట్టు గుర్తించారు. తనకు తెలియకుండానే తన డిజిటల్ సంతకంతో సహా పత్రం జారీ అవడంతో అవాక్కవడం ఆ అధికారి వంతయింది. విచారణ జరిపితే కొన్ని భూములకు సంబంధించి రికార్డులు లావాదేవీలు కూడా సదరు అధికారికి తెలియకుండానే జరిగిపోయినట్టు గుర్తించారు. మొత్తం వ్యవహారంపై కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదిక పంపారు. దీంతో సంబంధిత ఉద్యోగానికి రాజీనామా చేసి ఫోన్ స్విచ్ ఆఫ్‌చేసి వెళ్లిపోయినట్టు సమాచారం. ఈ ఘటన జిల్లాలో ప్రకంపనలు సృష్టిస్తోంది.



హైదరాబాదే మూలం...

ధరణి సాఫ్ట్‌వేర్‌పై సాంకేతిక పరమైన శిక్షణ పొందిన ఉద్యోగులు కొందరు హైదరాబాదు కార్యాలయంలో, జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలలో పనిచేస్తూ అక్రమాలకు కేంద్ర బిందువులవుతున్నారు. ఈ మొత్తం వ్యవహారాలకు హైదరాబాదే మూలం అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తహసీల్దార్, కలెక్టర్ డిజిటల్ సంతకాలు ఏదో సమయంలో ఆపరేటర్ల వద్దకు వెళుతూనే ఉంటాయి. వీటిని హ్యాక్ చేయడం ద్వారా ఏకంగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు.

అన్నిచోట్లా అక్రమాలు..

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ అక్రమాలు జరిగాయని, ముఖ్యంగా అశ్వారావుపేట, దమ్మపేట, బూర్గంపహాడ్, దుమ్ముగూడెం మండలాల్లో భారీఎత్తున భూ రికార్డుల అక్రమ మార్పిడి జరిగిపోయాయనే ఆరోపణలున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి, అక్రమాలు చేసినవారిని, చేయించుకున్నవారిపై చర్యలు తీసుకోవాలి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ జరుగుతోంది..: కృష్ణ, అశ్వారావుపేట తహసీల్దార్

నారంవారిగూడేనికి చెందిన ఓ వ్యక్తి ఫ్యామిలీ సర్టిఫికెట్ గురించి ఫిర్యాదు చేశారు. నాకు తెలియకుండానే నా డిజిటల్ సంతకంతో ఆ పత్రం జారీఅయినట్లు గుర్తించాం. దీంతో మొత్తం ఎన్ని లావాదేవీలు జరిగాయో నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపాను. ఏ విధంగా జరిగిందో తెలియడం లేదు.

ముమ్మరంగా క్రాప్ బుకింగ్

» క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల సర్వే

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 12: జిల్లాలో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. గత నెల రోజులుగా జల్లులు పడుతుండగా రైతలు సంతోషంతో పొలంబాట పట్టారు. జూలైలో మొదలైన వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. మరో వారం రోజులపాటు జిల్లాలో వరినాట్లు కొనసాగుతాయని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్ పంటల సాగు చివరి దశకు వస్తున్న క్రమంలో జల్లాలో 129 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేశారు. వ్యవసాయ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో సర్వే చేస్తోంది. జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి వివిధ పంటల్లో 5,96,662ఎకరాలకు సంబంధించి క్రాప్ బుకింగ్ చేశారు. క్రాప్ బుకింగ్‌కు సంబంధించి పంట విస్తీర్ణం, సర్వే నంబర్ల ప్రకారం రైతు వివరాలు, క్షేత్రస్థాయిలో పరిశీలించి జియో ట్యాగింగ్ చేపడుతున్నారు. ఫొటోలతో యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. దీని ద్వారా వానాకాలం సీజన్‌కు సంబంధించి కచ్చితమైన పంటల సాగు వివరాలు ప్రభుత్వానికి అందుతాయి. ఈ విధానం వ్యవసాయానికి సంబంధించి సంక్షేమ పథకా లను అందించడంలో దోహదపడుతుందని భావిస్తున్నారు.

జిల్లాలో 9 లక్షల ఎకరాల్లో సాగు

వానాకాలం సీజన్‌కు సంబంధించి ఖమ్మం జిల్లాలో 5.9లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. ఇప్పటి వరకు 3,81,637 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. వ్యవసాయ శాఖ వానాకాలం సీజన్‌కు సంబంధించి వరి 1.3లక్షల ఎకరాలు, మొక్కజొన్న 1894, పత్తి 1.8లక్షల ఎకరాలు, చెరకు 473, వేరుశనగ 47 ఎకరాలు, పెసర14,380 ఎకరాలతో విత్తనాలు వేసుకున్నారు.

జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో ప్రధాన పంటలుగా వరి, పత్తి సాగు వైపే మొగ్గు చూపారు. వరి 2.8లక్షల ఎకరాలకు 1.33 లక్షల ఎకరాల్లో నాట్లు వేసుకున్నారు. మరో వారం రోజులపాటు వరి నాట్లు కొనసాగుతాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. జిల్లాలో 2.01లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనాలు వేయగా ఇప్పటి వరకు 1.8లక్షల ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. వీటికి సంబంధించిన క్రాప్ బుకింగ్ పూర్తయ్యింది.

క్రాప్ బుకింగ్ సర్వే కొనసాగుతోంది: జేడీఏ విజయనిర్మల

జిల్లాలో వానాకాలం సాగుకు సంబంధించి క్రాప్ బుకింగ్ సర్వే కొనసాగుతోంది. జీపీఎస్ ద్వారా జియో ట్యాగింగ్, ఫొటోలతో సహా పంటల వివరాలు, వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నాం.

దరఖాస్తుల వెల్లువ..

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఆగస్టు 12: పాలేరు నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన కూసుమంచి జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమకానికి ఉత్తర్వులు విడుదలయ్యాయి. టీచింగ్ 12, నాన్ టీచింగ్ ఆరుగురి కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నోటిఫికేషన్ జూలై 31న రాగా ఆగస్టు 3 వరకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. టీచింగ్‌కు 635, నాన్ టీచింగ్‌కు 1440 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో తెలుగు 108, అంగ్లం 74, గణాతం 63, ఫిజిక్స్ 53, కెమిస్ట్రీ 69, బోటని 69, జువాలజీ 58, సివిక్స్ 31, ఎకనామిక్స్ 48, కామర్స్ 44, హిస్టరీ 20 తోపాటు నాన్ టీచింగ్ 1400ల దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ అనుమతితో డెమో ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రైతన్నకు 'మద్దతు' దన్ను

» పంటలకు కనీస ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వం

» అత్యధికంగా పత్తికి రూ.501, కందులపై రూ.550 పెంపు



ఖమ్మం మార్కెట్, ఆగస్టు 12: అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ప్రతి ఏటా పంటలకు కనీస మద్దతు ధర పెంచినట్లుగానే ఈ ఏడాది సైతం పంటలకు మద్దతు ధరలు పెంచి వెన్నుదన్నుగా నిలిచింది. 2024-25 గాను ప్రభుత్వం పలు రకాల పంటలకు ఎమ్మెస్పీ ధరల పెంపుపై ఇటీవల జరిగిన కేంద్ర కేబినేట్ సమావేశంలో ఆమోదం తెలిపింది. గతేడాది కంటే ఈ ఏడాది సాధారణ, గ్రేడ్-ఏ రకం (రెండు రకాలకు) వరి(ధాన్యం)పై క్వింటాలుకు రూ. 117లు చొప్పున పెంచి కామన్ రకానికి రూ. 2,300లుగా, గ్రేడ్-ఏ రకం వరికి క్వింటాలుకు రూ. 2,320 లుగా ఎమ్మెస్పీ ధరను నిర్ణయించారు. అంతేకాకుండా ఈ ఏడాది అత్యధికంగా కందులపై గతేడాది కన్నా క్వింటాలుకు రూ. 550 పెంచి రూ. 7,550 లుగా నిర్ణయించి కంది రైతులకు బాసటగా నిలిచారు. పత్తిపై సన్నపింజ రకానికి గతేడాదికన్నా రూ. 501 లు పెంచి రూ. 7,121లుగా, పొడవు పింజ రకాలకు సైతం రూ. 501లు పెంచి రూ. 7,521 లు, అంతే కాకుండా పెసర్లపై గతేడాది భారీగా క్వింటాలుకు రూ. 803 లుగా పెంచగా ఈ ఏడాది కేవలం క్వింటాలుకు రూ. 124 మాత్రమే పెంచి రూ. 8,682 లుగా నిర్ణయించారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం పంటలకు కనీస మద్దతు ధరలు పెంచడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు క్వింటాలుకు పెంచిన ధరలు రూపాయల్లో

పంట రకం	పెంచిన ధర	మద్దతు ధర
సాధారణ రకం వరి	117	2,300
ఏ గ్రేడ్ రకం వరి	117	2,320
పత్తి (సన్నపింజ)	501	7,121
పత్తి (పొడవు పింజ)	501	7,521
మొక్కజొన్న	135	2,225
పెసలు	124	8,682
రాగులు	444	4,290
జొన్నలు (హైబ్రీడ్ రకం)	191	3,371
జొన్నలు (మాల్ధండి రకం)	191	3,416
మినుములు	450	7,400
వేరుశనగ	406	6,783
సజ్జలు	125	2,625

ఆరోగ్య అత్యవసర పరిస్థితి విధించాలి

» పారిశుధ్య నిధులు ఇతర పథకాలకు మళ్లింపు

» ప్రజా సమస్యలపై 22న చలో హైదరాబాద్

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 12: పారిశుధ్య నిధులకు ఇతర పథకాలకు మళ్లించడంతో ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. సోమవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారిక లెక్కల మేరకు ఇప్పటికే 3వేల డెంగ్యూ కేసులు నమోదు కాగా హైదరాబాద్‌లో 1106, ఖమ్మంలో 287 కేసులు నమోదయ్యాయని, రాష్ట్రంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితిని విధించాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ధికారంలోకి వచ్చి 8నెలలు గడిచిన నేటి వరకు ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదన్నారు. పేదలకు ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పోడు భూములకు పట్టాలు ఇవ్వటంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సెబీ చైర్మన్‌పై అంతర్జాతీయ నిఘా సంస్థ చేసిన విమర్శలపై కేంద్ర ప్రభుత్వం జాయింట్ పార్లమెంట్ కమిటీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో సీబీఐ, ఈడీలను నిర్వీర్యం చేసిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు సెబీని రాజకీయ అవసరాలకు వాడుకుందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీతారామప్రాజెక్టు ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా ఉమ్మడి జిల్లా సాగు,తాగు నీటి సమస్యల పరిష్కారానికి వాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి. రామయ్య, గుర్రం అచ్చయ్య, సీవై పుల్లయ్య, మలీదు నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోటు రంగారావు

డాక్టర్ మృతికి సంతాపంగా నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యాధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 12: కోల్‌కతాలో 36 గంటల పాటు డ్యూటీలో ఉన్న ఓ మహిళా డాక్టర్‌పై లైంగికంగా దాడిచేసి దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో వైద్యులు అధికారులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ సంఘటన యావత్ దేశాన్ని చలించేలా చేసిందన్నారు. నిర్భయ సంఘటన కంటే దారుణమైన సంఘటన అని విచారం వ్యక్తం చేశారు. హాస్పటల్‌లోనే సెమినార్ హాల్లో నే ఈ సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఈ సంఘటనను దేశం మొత్తం ముక్త కంఠంతో ఖండించాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో డిప్యూటీ సూపరిన్‌టెండెంట్ డాక్టర్ బి కిరణ్ కుమార్, ఆర్ఎంవో భారతి బాయి, డాక్టర్ రాంబాబు, డాక్టర్ రాథోడ్ నాయక్, డాక్టర్ బాబూ రత్నాకర్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

బీఏఎస్ డ్రాపౌట్స్ ఖాళీల భర్తీ


డ్రా తీయిస్తున్న డీడీ కస్తాల సత్యనారాయణ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 12: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యార్థులు ఎంపిక గతంలోనే పూర్తి కాగా ఆయా పాఠశాలల్లో డ్రాపౌట్ల ఖాళీల భర్తీ కోసం సోమవారం ఖమ్మం డీపీఆర్సీ భవనంలో తొలిసారిగా ఎంపిక ప్రక్రియను అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ సమక్షంలో నిర్వహించారు. గతంలో ఒక సారి విద్యార్థులు ఎంపికైన తర్వాత విద్యార్థులు ఆయా పాఠశాలల్లో జాయిన్ కాకపోతే ఆ సీట్లు అలాగానే ఖాళీగా ఉండేవి. శిక్షణా కలెక్టర్ పర్యవేక్షణలో ఉప సంచాలకుడు కస్తాల సత్యనారాయణ 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, రెసిడెన్సియల్, నాన్ రెసిడెన్సియల్ విభాగాల్లో 33 ఖాళీలను భర్తీ చేశారు. లాటరీలో వచ్చిన విద్యార్థులతో పాటుగా వెయిటింగ్ జాబితాను ఎంపిక చేశారు.

రివర్స్‌తోనే వైరాకు గోదావరి జలాలు

వైరా, ఆగస్టు 12: వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించేందుకు భగీరథ ప్రయత్నమే సాగుతోంది. ఎన్నెస్పీ 21మెయిన్ బ్రాంచ్ కెనాల్(ఎంబీసీ)లో సుమారు 13కిలోమీటర్ల దూరం గోదావరి జలాలను ఎదురు దిశలో(వెనుక్కు) నడిపించటం ద్వారా ఆ నీరు వైరా రిజర్వాయర్‌కు చేరేలా ప్రభుత్వం, ఇంజనీరింగ్ అధికారులు కృషి చేస్తున్నారు. 15వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీతారామ ప్రాజెక్టు వద్ద మూడు పంపుహౌజ్‌లను ప్రారంభించటం ద్వారా గోదావరి జలాలు వ్యతిరేక దిశలో ప్రవహించి వైరా రిజర్వాయర్‌కు చేరుకోవాల్సి ఉంది. గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తీసుకువచ్చేందుకు ఇంజనీరింగ్ నిపుణుల సూచనలతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టింది. ఏన్కూరు మండల పరిధిలోకి వచ్చే 21ఎంబీసీ 51.490కిలోమీటరు వద్ద రాజీవ్ లింక్ కెనాల్‌ను అనుసంధానం చేసి గోదావరి జలాలను వైరా రిజర్వాయర్ తోపాటు మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని ప్రాజెక్టులు, ఎన్నెస్పీ పరిధిలోని సుమారు 1.50లక్షల ఎకరాలకు నీరందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.75కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వ నుంచి రాజీవ్ లింక్ కెనాల్‌ను 21ఎంబీసీ 51.490వరకు చేపట్టిన నిర్మాణం అనేక అడ్డంకులను అధిగమించి చివరి దశకు చేరుకుంది. ఈ లింక్ కెనాల్‌కు ఈ ఏడాది మార్చి 13న వైరాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

వ్యతిరేక దిశలో 13కి.మీ. గోదావరి నీళ్లు పయనం..

21ఎంబీసీ 51.490కిలోమీటర్ నుంచి వైరాకు గోదావరి జలాలు రావడానికి 38.690కిలోమీటర్ వద్దనున్న ఎస్కేప్ లాకుల వరకు ఎదురు దిశలో పయనించాల్సి ఉంది. 38.690కిలో మీటర్ వద్ద నిమ్మవాగు ఉంది. ఆ నిమ్మవాగులోకి 21ఎంబీసీపై ఉన్న రెండు ఎస్కేప్ లాకుల నుంచి నీరు విడుదల చేస్తే అవి నిమ్మవాగు నుంచి సుమారు 23కిలోమీటర్లు పైనుంచి వైరా రిజర్వాయర్‌కు చేరతాయి. ఎన్నెస్పీ కాల్వల నిర్మాణ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వైరా రిజర్వాయర్‌కు అత్యవసర సమయాల్లో సాగునీటి ఎద్దడి తలెత్తినప్పుడు సాగర్‌జలాలను ఎస్కేప్ లాకుల ద్వారా నిమ్మవాగు నుంచి రిజర్వాయర్‌కు విడుదల చేసి సాగుచేసిన పంటలను కాపాడేందుకు ముందుచూపుతో చర్యలు తీసుకున్నారు. ఆయన ముందుచూపు ఫలితమే వైరా రిజర్వాయర్ ఆయకట్టులో సాగునీటి ఎద్దడి ఏర్పడిన అత్యవసర సమయాల్లో సాగర్‌జలాలను వైరాకు ఎస్కేప్ లాకుల ద్వారా నిమ్మవాగు నుంచి తీసుకు వస్తున్నారు. సాగర్‌జలాలు లభ్యత లేని సమయంలో ఈ ఎస్కేప్ లాకుల నుంచి గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు సరఫరా చేసేలా ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాని ఫలితమే 21ఎంబీసీలో సుమారు 13కిలోమీటర్ల దూరం గోదావరి జలాలను ఎదురుదిశలో నడిపించి వైరా రిజర్వాయర్‌కు తీసుకురావడానికి ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టారు. ఎస్కేప్ లాకులు ఉన్న 38.690కిలోమీటర్‌కు కొంత ముందు అంటే 39.140హెడ్ రెగ్యులేటర్‌ను ఎన్నెస్పీ కాల్వల సమయంలోనే నిర్మించారు. ఈ హెడ్‌రెగ్యులేటర్ వద్ద లాకులను బంద్ చేసి ఎస్కేప్ లాకుల నుంచి సాగర్‌జలాలను నిమ్మవాగుకు విడుదల చేసేవారు. 39.140కిలోమీటర్ వద్దనున్న హెడ్‌రెగ్యులేటర్ నుంచి 52.299కిలోమీటర్ వద్ద మరో క్రాస్ హెడ్‌రెగ్యులేటర్ ఉంది. ఈ మధ్య దూరంలోని 21ఎంబీసీ కాల్వల్లో సాగర్‌జలాల ప్రవాహ సామర్థ్యం 4,591క్యూసెక్కులుగా ఉంది. 52.299కిలోమీటర్ వద్దనున్న హెడ్‌రెగ్యులేటర్‌కు కొంత పైభాగంలో అంటే 850మీటర్ల దూరంలో ఉన్న 51.490కిలోమీటర్ వద్ద రాజీవ్ లింక్ కెనాల్‌ను కలుపుతున్నారు. రాజీవ్ లింక్ కెనాల్ నుంచి అక్కడ సాగర్‌కాల్వలోకి వచ్చిన గోదావరి జలాలను 850మీటర్ల ముందున్న హెడ్‌రెగ్యులేటర్ వద్ద షట్టర్లు దించి అక్కడి నుంచి 39.140కిలోమీటర్ వద్దనున్న రెగ్యులేటర్‌ను దాటించి 38.690కిలోమీటర్ వద్దనున్న ఎస్కేప్ లాకుల నుంచి నిమ్మవాగులోకి సాగర్‌జలాలను విడుదల చేస్తారు. ఈ ఎస్కేప్ లాకుల సామర్థ్యం 800క్యూసెక్కులుగా ఉంది. సుమారు 13కి.మీ. గోదావరి జలాలు 21ఎంబీసీలో ఎదురుదిశలో పయనించాల్సి ఉంది. వ్యతిరేక దిశలో వచ్చిన గోదావరి జలాలు వైరాకు చేరుకుంటాయి. ఒకవేళ ఈ 13కిలోమీటర్లు గోదావరి జలాలు ఎదురుదిశలో పయనించే పరిస్థితి లేకపోతే ప్రత్యామ్నాయంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గిన్నెల వాగు వద్ద కొత్తగా ఎస్కేప్ లాకులను నిర్మించి అక్కడి నుంచి గోదావరి జలాలను నిమ్మవాగుకు పంపించి వైరా రిజర్వాయర్‌కు వచ్చేలా చేయాలని కూడా ప్రభుత్వం, ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం.

ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలతో ప్రజల్ని మోసం చేస్తున్న కాంగ్రెస్

» రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని

సుజాతనగర్, ఆగస్టు 12: ప్రాజెక్టులను పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవాల పేరుతో ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధపడిందని, ప్రాంతాల మధ్యన చిచ్చుపెట్టే దుశ్చర్యలకు పాల్పడుతోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్ విమర్శించారు. సోమవారం సుజాతనగర్‌లో ఎలమంచిలి వంశీ కృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సులో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తికాకుండానే హడావుడిగా ప్రారంభోత్సవానికి ప్రభుత్వ సిద్ధపడిందని వారు విమర్శించారు. 18 వేల కోట్ల రూపాయలతో నిర్మాణం చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికి 8వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, ఇంకా 10వేల కోట్ల రూపాయల పైన పని చేయాల్సి ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టుని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని మంత్రులు ప్రకటనలు ఇస్తున్నారని, కాని నీటిని ఏవిధంగా విడుదల చేస్తారో ప్రకటించడం లేదన్నారు. గోదావరిపై సీతమ్మ సాగర్ డ్యాం పూర్తి కాకుండా, నీరు సీతారామ ప్రాజెక్టుకు ఎలా చేరుతుందని వారు ప్రశ్నించారు. సీతారామ కట్టేదే గోదావరి బ్యాక్ వాటర్‌తోనని, అటువంటి బ్యాక్ వాటర్ లేకుండా ఈ ప్రాజెక్ట్ ఎలా నడుస్తుందని అన్నారు.



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్ రావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 3.5 లక్షల ఎకరాలకు నీరు అందించిన తర్వాతనే ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు ఇవ్వాలని న్నారు. గోదావరిపై నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బహుళార్ధక సాధక సాధక ప్రాజెక్ట్ అని, 280 మెగా వాట్ల విద్యుత్, 30 టీఎంసీల వాటర్ స్టోరేజీ, రహదారి, మిషన్ భగీరథ, హెవీ వాటర్‌ప్లాంట్ వాటర్, వంటి బహుళ ప్రయోజనాలతో రూ. 3500 కోట్లతో నిర్మిస్తున్న ప్రాజెక్టు అని, అటువంటి ప్రాజెక్ట్ పూర్తికాకుండా సీతారామ ప్రాజెక్ట్ పని చెయ్యడం సాధ్యం కాదన్నారు. కాలువలు కూడా పూర్తికాకుండా నీరు ఎలా ఇస్తారని వారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని అయిలయ్య, జిల్లా అధ్యక్షుడు ఎలమంచిలి వంశీకృష్ణ, కార్యదర్శి అన్నవరపు సత్యన్నారాయణ, నాయకులు కొక్కెరపాటి పాల్గొన్నారు.

వసతి.. దుస్థితి

» ఇరుకైన గదుల్లో ఇబ్బందుల మధ్య చదువులు

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలోని పలు గురుకులాల్లో విద్యార్థులు ఇరుకైన గదుల్లోనే నివాసం ఉంటున్నారు. కొన్నిచోట్ల హాస్టల్ గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకే ప్రాంగణంలో లెక్కకు మించిన గురుకులాలు ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని మధిర మండలం క్రిష్టాపురంలో ఎనిమిది గురుకులాలు ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. వైరా, రఘునాథపాలెం, కూసుమంచి, కుంచపర్తి, వీవీక్రిష్టారం, బోనకల్లు బీసీ గురుకుల కళాశాలలను ఒకే ప్రాంగంణంలో నిర్వహిస్తుండగా.. దాంతోపాటు ముదిగొండ ఎస్సీ బాలుర పాఠశాల, కళాశాల కూడా అందులోనే ఉన్నాయి. రఘునాథపాలెం మండలపరిధిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో ఆరు గురుకులాలు నిర్వహిస్తుండగా.. దానవాయిగూడెం, చెర్వుమాధారం బాలికల, లంకపల్లి బాల, బాలికల పాఠశాలలు, మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలతోపాటు, బీసీ డిగ్రీ గురుకుల కళాశాల సైతం అందులోనే నిర్వహిస్తున్నారు. బోనకల్ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో తరగతి గదుల కొరత వల్ల విద్యార్థులకు బోధన చేసిన గదుల్లోనే సామగ్రి పెట్టుకొని అక్కడే పడుకుంటున్నారు. బోధనకు సరిపడ గదులున్నా, డార్మెటరీ గదులతో పాటు నిద్రించడానికి వసతి లేదు. తరగతి గదుల కొరత వల్ల రెండు తరగతులను వేరే ప్రాంతాల్లో నిర్వహించడం వల్ల ప్రవేశం పొందిన గురుకులంలో ఉండలేని పరిస్థితి నెలకొంది. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు గురుకులాల్లో విద్యార్థినులకు సరిపడా వసతి భవనాలు, తరగతి గదులు, రక్షణ గోడలు లేవు. తరగతి గదుల్లోనే విద్యార్థినులు తలదాచుకోవాల్సిన దుస్థితి ఉంది. ముసలిమడుగులో ఏర్పాటు చేసిన తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులు తరగతి గదులనే వసతిగా ఉపయోగిస్తున్నారు. తిరుమలాయపాలెం ఎస్సీ గురుకులంలో సరిపడా తరగతి గదులు లేకపోవడంతో డార్మెటరీల్లోనే తరగతి గదులు నిర్వహిస్తున్నారు. దమ్మపేట మండలంలో అంకంపాలెం గిరిజన గురుకుల కళాశాలలో, కూసుమంచిలోని బీసీ గురుకులంలో విద్యార్థులకు సరిపడా డార్మెటరీ సౌకర్యం లేదు.

అపరిశుభ్ర వాతావరణం.. విద్యార్థులకు అనారోగ్యం

ఉమ్మడి జిల్లాలోని పలు గురుకులాలు అపరిశుభ్ర వాతావరణంలో కొనాసాగుతున్నాయి. నీళ్ల ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, పరిసరాల మురికి కూపాలుగా మారడం వంటి కారణాలతో ఆయా గురుకులాల్లోని విద్యార్థులు నిత్యం అనారోగ్యం పాలవుతున్నారు. అంతే కాకుండా అనేక గురుకులాల్లో మూత్రశాలలు వినియోగంలో లేకపోగా, మరికొన్నిచోట్ల ఉన్నా వాటికి తలుపులు, నీటిసౌకర్యం లేదు. ఖమ్మం జిల్లా మధిర మండలం కృష్ణాపురంలో నిర్వహిస్తున్న ముదిగొండ బీసీ గురుకుల కళాశాల వద్ద మూత్రశాలల్లో కొన్నింటికి తలుపులు లేవు. మూత్రశాలలు ఉన్న చుట్టుపక్కల ప్రాంగణమంతా పిచ్చిమొక్కలు, గడ్డితో నిండి అడవిని తలపిస్తోంది. గాంధీనగరం ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సరైనా నీటివసతి లేకపోవడంతో ఆ ప్రాంతానికి వెళ్లినవారికి దుర్వాసన వెదజల్లుతోంది. ఏన్కూరు జనరల్ బాలుర గురుకులంలో తగినన్ని మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. టేకులపల్లిలో బాలుర గురుకులంలో ప్రాంగణమంతా అపరిశుభ్రంగా ఉంది. స్నానాల గదులకు డోర్లు కూడా లేవు. కొత్తగూడెం బీసీ గురుకులంలో బాత్‌రూం డోర్లు కూడా సరిగా లేవు. ఖమ్మంరూరల్ మండలం మైనారిటీ గురుకులంలో పక్కనే ఖాళీస్థలంలో మురుగు నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. గుండాల మండల కేంద్రంలో ఉన్న గురుకులాల్లో మరుగుదొడ్లు, బాత్‌రూంలు సక్రమంగా లేకపోవడంతో అపరిశుభ్రంగా ఉన్నాయి. విద్యార్థులు స్నానాలు చేసే వాటర్ ట్యాంక్ పాకురుపట్టి ఉంది. ఆ ట్యాంకులో నీటనే విద్యార్థులు వాడుతున్నారు.

శిథిలావస్థలో భవనాలు...

పలు గురుకులాలు శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నిర్వహిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. బోనకల్‌లోని బీసీ గురుకుల బాలుర పాఠశాలలో పాఠశాల ఆవరణలో గతంలో ఎన్ఎస్పీ క్వార్టర్లుగా ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి నిరుపయోగంగా ఉన్నా వాటిని తొలగించకపోవడంతో అందులోకి విషసర్పాలు చేరుతున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కారేపల్లి మండలం గాంధీనగరం ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల దట్టమైన గుట్టపక్కన పాఠశాల నిర్మాణం చేయడంతో వర్షాకాలం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులతోపాటు భయందోళన చెందుతున్నారు. కూసుమంచి మండలం నాయకన్‌గూడెం బీసీ గురుకులంలో పాఠశాల ఆవరణలోనే సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యార్థులు భయపడుతున్నారు. ఖమ్మంరూరల్ మండలం మైనారిటీ గురుకులంలో పాఠశాల గోడకు ఆనుకుని విద్యుత్‌లైన్ ఉండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.


కిష్టాపురం గురుకులంలో తలుపులు లేని మూత్రశాలలు

తిరుమలాయపాలెం ఎస్సీ గురుకులంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ చీకటిగా ఉంటుందని తెలిపారు. కల్లూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఆహారం నాణ్యతగా లేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. భోజనం సరిగ్గా ఉండకటం లేదని, కూరలు, సాంబారు నాణ్యతగా ఉండటం లేదని చెబుతున్నారు. పురుగులతో కూడిన బియ్యంతో విద్యార్థులు భోజనం చేయలేకపోతున్నారు. సత్తుపల్లిలో మైనార్టీ గురుకులంలో, కుళ్లిపోయిన అరటిపళ్లు, నాణ్యతలేని కూరగాయాలతో వంటలు చేస్తున్నారని, భోజనం ఉడకటం లేదని, పప్పుకూరకు బదులు చారు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. భద్రాచలంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో భవనాలు కురుస్తుండటం, తరగతి గదుల రేకులు విరిగిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సుజాతనగర్ మండలంలో ఉన్న చుంచుపల్లి బీసీ గురుకుల బాత్‌రూం డోర్లు కూడా సరిగా లేవు. పాల్వంచలోని కిన్నెరసాని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. చుట్టు ప్రహరీ లేదు. అక్కడ డార్మంటరీ గది లేదు. పాఠశాల శిథిలావస్థలో ఉండటం వల్ల ఎప్పుడు కూలుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రహరీ లేకపోవడం వల్ల వర్షం వస్తే మురుగు నీరు ప్రవహిస్తోంది. పినపాక నియోజవకర్గంలోని ఉన్న గురుకుల పాఠశాల భవనానికి రక్షణగా ప్రహరీ లేదు. డార్మెట్రీ నిర్మాణ దశలో ఉంది. ఊరికి దూరంగా పొలాల మధ్య గుట్టపై ఉన్న గిరిజన పాఠశాల కాలేజీ ప్రారంభోత్సవం నాడే చుట్టూ ప్రహరీ, రోడ్డు వీధిలైట్ల కోసం నివేదికలు తీసుకున్నారు. కానీ నాలుగేళ్లవుతున్నా అది అసంపూర్ణంగానే ఉంది. బీసీ బాలికల గురుకుల పాఠశాల వర్షం వస్తే తరగతి గదుల్లో వర్షం పడుతోంది. పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి మినీ గురుకుల పాఠశాల అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది. సకల సదుపాయాలు ఉన్నా భవనంలో నిర్వహణ లోపంతో శిథిల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక్కడ ఉండే 150మంది విద్యార్థులకు మిషన్ భగీరథ నీరే శరణ్యం. మరుగుదొడ్లు నిర్వహన లేక అధ్వాన స్థితిలో దర్శనమిస్తున్నాయి. గుండాల మండల కేంద్రంలో ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల, ఎస్టీ బాలుర గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఈ వసతిగృహాల్లో సక్రమంగా తలుపులు, కిటికీలు లేవు. అక్కడ విద్యుత్ సమస్య ఉంది. అశ్వారావుపేట మండలంలో బీసీ బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి కిందనే విద్యార్థులు నిద్రించాల్సిన పరిస్థితి నెలకొంది. దమ్మపేట మండలంలో అంకంపాలెం గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థులకు సరిపడా డార్మెటరీ సౌకర్యం లేదు. విద్యుత్ పోతే నీటికి, వెలుతురుకు ఇబ్బందులు తప్పవు. దమ్మపేట గురుకులంలో భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. అన్నపురెడ్డిపల్లి బీసీ గురుకులంలో బాత్ రూంలకు తలుపులు లేవు. ఇలా ఉమ్మడి జిల్లాలోని అనేక గురుకులాలు సమస్యల నిలయంగా మారాయి. ప్రభుత్వం ఇప్పటికైనా వీటిపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి కృషి

(5వ పేజీ తరువాయి)

చేయబోతున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం ఖిల్లాతో పాటు పురాతన బౌద్ధస్థూపం, భక్తరామదాసు నివాసం, పాలేరు నుంచి భద్రాచలం వరకు ఎన్నో పర్యాటక ప్రదేశాలున్నాయని, వీటిని అభివృద్ధి చేస్తామన్నారు. నేలకొండపల్లి బౌద్ధస్థూపం వద్దకు కూడా దేశ, విదేశాలనుంచి బౌద్ధగురువులు వచ్చి బౌద్ధ బోధనలు చేసేలా వసతులు కల్పిస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పర్యాటక ప్రదేశాలు, నదులు, తెలంగాణలో అనేకం ఉన్నాయని, ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, వివిధ రంగాల వారు పర్యాటక ప్రదేశాలకు వచ్చేలా చూస్తామన్నారు.

పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే నిర్మించేందుకు రూ.30కోట్లు కేటాయిస్తామన్నారు. ఖిల్లాపై అనేక వసతులు కల్పిస్తామన్నారు. అలాగే నేలకొండపల్లి బౌద్ధస్థూపం వద్ద దాని చరిత్రను చాటిచెప్పేలా వసతులు, నిర్మాణాలు చేపడతామన్నారు. భక్తరామదాసు సొంతిల్లును దర్శించడం తనకు మంచి అనుభూతిని కలిగించిందన్నారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజం, కల్చరల్ టూరిజం, ఎకో టూరిజం, పార్క్ టూరిజం, ఆర్కియాలజీ టూరిజం విభాగాలను సర్క్యూట్లుగా చేసి భారీగా ప్రచారం కల్పించబోతున్నామన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు అన్నివర్గాల వారు పర్యాటక ప్రాంతాలు తిలకించేలా ప్రోత్సహిస్తామన్నారు.

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా ఎంతో చరిత్రాత్మకమైన ఖిల్లా అన్నారు. నేలకొండపల్లి బౌద్ధస్థూపంతో పాటు పాలేరు నుంచి పర్ణశాల వరకు, పాలేరు నుంచి పాపికొండల వరకు గతంలో కొంత అభివృద్ధి చేశామని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఎకో టూరిజం కింద వెలుగుమట్ల పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. ఖమ్మంఖిల్లాతో పాటు ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాని పర్యాటక శాఖ మంత్రిని కోరారు. భద్రాచలానికి నేషనల్ హైవేలతో పాటు మల్కన్‌గిరి, ఛత్తీస్‌గడ్ నుంచి పాండురంగాపురం వరకు రైల్వేలైన్ రాబోతోందన్నారు. కొత్తగూడెం పరిసరాల్లో ఎయిర్‌పోర్టు వస్తే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రంగా భద్రాచలం అభివృద్ధి చెందుతుందన్నారు.

నేలకొండపల్లి బౌద్ధస్థూపం వద్ద రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో పురాతన బౌద్ధ స్థూపం పురాతన శివాలయం, పాలేరు జలాశయంతో పాటు భక్తరామదాసు నివాసం ప్రాంతం ఉన్నందున వీటన్నింటిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. పర్యాటకశాఖపరంగా నిధులు ఇవ్వాలని మంత్రిని కోరారు. దేశవిదేశాల్లోని బౌద్ధ ప్రచారకులు ఈ ప్రాంతానికి రప్పించడం ద్వారా నేలకొండపల్లి బౌద్ధస్థూపానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు.

వైరా ఏఎంసీ చైర్మన్ పదవి కోసం...

ఆశావహుల ఎదురుచూపులు!

వైరా, ఆగస్టు 12: వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవి కోసం బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఏఎంసీ చైర్మన్ పదవి బీసీ సామాజిక వర్గానికి రిజర్వేషన్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి ఉంది. దాంతో కాంగ్రెస్‌లోని పలువురు బీసీ నాయకులు ఈ చైర్మన్ పదవిపై గంపెడాశతో ఉన్నారు. వైరా ఏఎంసీ పరిధిలో వైరా, కొణిజర్ల, తల్లాడ మండలాలున్నాయి. అయితే వైరా, కొణిజర్ల మండలాల్లోని బీసీ నాయకులకే ఈ పదవి దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ రెండు మండలాలు వైరా నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. తల్లాడ మండలం సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆ మండలానికి కేవలం ఉపాధ్యక్ష పదవీ మాత్రమే లభించే అవకాశముంది. గత నవంబరు 30న జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటివరకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏఎంసీ చైర్మన్‌గా ఉన్న పసుపులేటి మోహన్‌రావు పదవికి రాజీనామా చేశారు. ఆతర్వాత కొన్నినెలలకు ఆయన కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వైరా మార్కెట్ ఏర్పడిన దాదాపు 30ఏళ్ల తర్వాత తొలిసారి వైరాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా మాలోతు రాందాస్‌నాయక్ గెలిచారు.

1993లో ఈ మార్కెట్ కమిటీ ఏర్పడిన తర్వాత ద్వితీయ మాజీమంత్రి శీలం సిద్దారెడ్డి ముఖ్యఅనుచరుడైన షేక్‌సోందు సాహెబ్ ప్రథమ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆతర్వాత టీడీపీ అధికారంలోకి రావడంతో ఆపార్టీ నాయకులు చైర్మన్ పదవులు అలంకరించారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసమయంలో అప్పటి కేంద్రమంత్రి రేణుకాచౌదరి వర్గీయులైన తల్లాడ మండలానికి దీవెల కృష్ణయ్య, కొణిజర్ల మండలానికి చెందిన సూరంపల్లి రామారావులు మార్కెట్ కమిటీ చైర్మన్లుగా పనిచేశారు. 2023ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా రాందాస్‌నాయక్ గెలవడం జరిగింది. వైరా మండలానికే చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కూడా వైరా ఏఎంసీ చైర్మన్ విషయంలో కీలకంగా ఉన్నారు. భట్టి విక్రమార్క ఆశీస్సులున్న వారినే ఈ పదవి వరిస్తుందనే చర్చ కూడా ఉంది. మొదటి నుంచి భట్టి వర్గంతోనే ఉంటున్న పలువురు బీసీ నాయకులు చైర్మన్ పదవి కోసం తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

వారిలో ముఖ్యంగా మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు, భట్టి స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ నూతి వెంకటేశ్వరరావు, రెబ్బవరం, పాలడుగు మాజీ సర్పంచ్‌లు గుత్తా కళావతి, పొట్టపల్లి శ్రీను, వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, పట్టణ కాంగ్రెస్ నాయకుడు బోళ్ల గంగారావు, రెండోవార్డు కౌన్సిలర్ బత్తుల గీత అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడైన ధార్న రాజశేఖర్ ఈ చైర్మన్ పదవిపై ఆశపెట్టుకొని తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పదవీ కోసం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు విన్నవించారు. అలాగే కొణిజర్ల మండలంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులైన ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీను, పెద్దమునగాల మాజీ సర్పంచ్ పరికపల్లి శ్రీను వైరా ఏఎంసీ చైర్మన్ పదవిపై ఆశపెట్టుకున్నారు. వీరు కూడా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మంత్రి పొంగులేటి ద్వారా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలవుతున్నందున నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తుండటంతో, వైరా మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని కూడా కొద్దిరోజుల్లోనే నియమిస్తారని ప్రచారంతో ఎవరికివారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.



వైరా వ్యవసాయ మార్కెట్ యార్డు

'విద్యార్థులు బయటకు వెళ్లకుండా చూడాలి'

భద్రాచలం, ఆగస్టు 12: ఆశ్రమ పాఠశాల, గురుకులాల్లో చదివే విద్యార్థులు అనధికారికంగా బయటకు వెళ్లకుండా ఎప్పటికప్పుడు సంబంధిత ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని భద్రాచలం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన గిరిజన దర్బార్‌లో అర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించారు. మిగతావి సంబంధిత అధికారులకు పంపుతూ త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో గురుకులం నాగార్జునరావు, జీసీసీ డీఎం దావీద్, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, కొండరెడ్ల అధికారి నరేష్ పాల్గొన్నారు.


వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు


లిఫ్ట్ స్విచ్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

పోలంపల్లి ఎత్తిపోతల ప్రారంభం

చింతకాని, ఆగస్టు 12: ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా వత్సవాయి మండలం పోలంపల్లి ఎత్తిపోతల పథకాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సోమవారం ప్రారంభించారు. ఈ ఎత్తిపోతల పథకం గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంది. మరమ్మతులు అనంతరం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా ఏపీలోని వత్సవాయి మండలంతో పాటు ఖమ్మం జిల్లా చింతకాని మండలం చిన్నమండవ రెవెన్యూ, బోనకల్ మండలం చొప్పకట్లపాలెంలోని సుమారు 800 ఎకరాలు భూమి సాగులోకి రానుంది. కార్యక్రమంలో చింతకాని మాజీ జడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, రైతులు వడ్లమూడి రాంబాబు, పెంట్యాల శ్రీనివాసరావు, కిలారు సూర్యనారాయణ పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దండి

● పర్యాటక శాఖ మంత్రి జూపల్లికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వినతి


మంత్రి జూపల్లికృష్ణారావుకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు/బూర్గంపాడు, ఆగస్టు 12: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక నియోజకవర్గంలో 1,500 సంవత్సర కాలంలో కాకతీయుల కాలం నాడు నిర్మించిన పురాతనమైన దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌లు వినతి పత్రాన్ని అందించారు. బూర్గంపాడు మండలంలోని మోతె గోదావరి మధ్యలో గల గుట్ట పై శివాలయం ఉందని చక్కటి వాతావరణంతో ఈ దేవాలయం దర్శనమిస్తోందని తెలిపారు. కార్తీక మాసంతో పాటు, వేలాది మంది భక్తులు ప్రశాంతత కోసం ఈదేవాలయాన్ని దర్శించుకుంటారన్నారు. స్వామి వారి దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారని పేర్కొన్నారు. అదే విధంగా వసతి సౌకర్యం కల్పించాలని విన్నవించారు. గత పుష్కరాల సమయంలో మోతెలో ఘాట్‌ను ఏర్పాటు చేసి వీఐపీ ఘాట్‌గా మార్చారని మంత్రి దృష్టికి తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చేస్తే మరింత గుర్తింపు వస్తుందని వివరించారు.

గ్రీవెన్స్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 12: సమీకృత జిల్లా కార్యాలయాల భవనం (ఐడీవోసీ)లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతులు వెల్లువెత్తాయి. అదనపు కలెక్టర్లు ఎస్ మధుసూదన్, కలెక్టరేట్ ఈ సెక్షన్ పర్యవేక్షకులు కారుమంచి శ్రీనివాసరావు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో అందిన సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ధరణీ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, సీపీవో శ్రీనివాస్, ఎంపీఓ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అందిన ఫిర్యాదుల్లో ప్రధానమైనవి ఇలా :

- పెనుబల్లి మండలం గౌరారం రెవెన్యూలో రైల్వే లైన్ కింద సర్వేనెంబర్ 452లో చెట్లు నష్టపోయానని వాటికి పరిహారాన్ని ఇప్పించాలని యనమల సీతయ్య కోరారు.
- తన పొలానికి వెళ్లకుండా తమ గ్రామానికి చెందిన వ్యక్తులు గోడకట్టి పొలానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారంటూ గతంలో ఫిర్యాదు చేశానని దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించి పెండింగ్‌లో పెట్టారని, దీనిపై తిరిగి వాళ్లే నాకుమారుడిపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారని దీనిపై విచారించి అక్రమ కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఖమ్మం రూరల్ మండలానికి చెందిన కొమరబత్తిన సంజీవరావు ఫిర్యాదు చేశాడు.
- కామేపల్లి మండలం ఊటుకూరు గ్రామంలో యూ పీఎస్ స్కూల్‌లో ఒక్కరే టీచర్ ఉన్నారని, 36 మంది పిల్లలు ఉన్నారని, ఒక్క టీచర్ వలన పిల్లలు ఇబ్బంది పడుతున్నారని, మారో టీచర్‌ను అక్కడికి పంపించాలని గ్రామస్థులు విన్నవించారు.
- తన తండ్రి ఆంధ్రాబ్యాంకులో రుణాన్ని తీసుకున్నాడని, అయితే తండ్రి చనిపోవడంతో 25వేల రూపాయల బకాయి ఉందని, కానీ తండ్రి పేరుతో ఉన్న భూమిని తన పేరుతో మార్చుకున్నాని బ్యాంకు రుణాన్ని మాఫీ చేయాలంటూ ముదిగొండ మండలం గోకిన పల్లి గ్రామానికి చెందిన గుంజలూరి రాంబాబు అనే దివ్యాంగుడు అదనపు కలెక్టర్‌కు విన్నవించారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్


ఆక్రమణలను తొలగిస్తున్న ఫారెస్టు అధికారులు

కమలాపురంలో ఫారెస్టు భూముల ఆక్రమణ

● అక్రమ నిర్మాణాలను తొలగించిన అధికారులు

మణుగూరు, ఆగస్టు 12: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామ శివారున ఉన్న ఫారెస్టు భూములను కొందరు వ్యాపారులు స్థానికులతో కలిసి కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆక్రమణలను సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు నెల రోజుల క్రితమే గ్రా మస్థులకు ఫారెస్టు భూములపై అవగాహన కల్పించి, ట్రెంచ్‌ను కూడా కొట్టారు. ఫారెస్టు భూముల హద్దులను నిర్ధారించారు. అయినా కూడా స్థానికులు గతంలో కంటే ఇంకా కాస్త ముందుకెళుతూ ఫారెస్టు భూమి ఆక్రమణలు చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఫారెస్టు అధికారులు సిబ్బందితో రంగంలో దిగి అక్రమ నిర్మాణాలు అన్నింటినీ ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

వివాహిత మృతదేహం లభ్యం

బూర్గంపాడు, ఆగస్టు 12: కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 5న గోదావరి వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత మృతదేహం సోమవారం లభ్యమైంది. మండల పరిధిలోని సారపాక పంచాయతీలో గల గాంధీనగర్ కాలనీకి చెందిన భూక్యా శైలజ(20) గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు గోదావరిలో గాలింపులు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఏపీలోని కుక్కునూరు మండలం దామరచర్ల సమీపంలో గోదావరి ఒడ్డున ఓ మృతదేహం చెట్టుకు వేలాడుతూ ఉండడం గమనించిన జాలర్లు అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యులు, బూర్గంపాడు పోలీసులు మృతదేహం వద్దకు చేరుకుని పరిశీలించారు. కాగా మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో ఉండడంతో, గుర్తు పట్టడం కష్టమైంది. కాగా బాధిత కుటుంబసభ్యులు మృతదేహం శైలజ అనే తెలుపుతున్నప్పటికీ, పోస్టుమార్టం అనంతరం నిర్ధారించే అవకాశం ఉందని పో లీసులు తెలిపారు. మృతదేహం మెడలో ఉన్న నల్లపూసల తాడు ఆధారంగా బా ధిత కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తు పట్టినట్లు సమాచారం.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెనుబల్లి, ఆగస్టు 12: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గణేశులపాడు గ్రామసమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వీఎంబంజర్ ఎస్ఐ వెంకటేష్ తెలిపిన ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా గోపాలపురం గ్రామానికి చెందిన వరదబోయిన నాగేశ్వరరావు(40)అదే గ్రామానికి చెందిన నర్సింహారావు అనే వ్యక్తితో కలిసి ఆదివారం సాయంత్రం గణేశులపాడు గ్రామానికి వచ్చి మద్యం సేవించారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో నాగేశ్వరరావు ముందు వెళ్తున్నాడని భావించి నర్సింహారావు వెనుక ఇంటికి వెళ్లాడు. సోమవారం నాగేశ్వరరావు ఇంటికి చేరలేదని తెలిసి వాకబు చేయగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఢీకొన్న వాహనం టిప్పర్‌గా భావించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ యువకుడు..

చింతకాని, ఆగస్టు 12: మనస్తాపంతో క్రిమిసంహారక మందు సేవించి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతర్లపాడు గ్రామానికి చెందిన మాతంగి రమేష్ (30)కు దళితబంధు పథకంలో ఒక ట్రాక్టర్ వచ్చింది. ట్రాక్టర్ మరమ్మత్తు సామాగ్రి కొనేందుకు కుటుంబ సభ్యులను నగదు అడిగే విషయంపై మనస్తాపం చెందాడు. ఈ నెల 10వ తేదీన పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రమేష్ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూవివాదంలో ఐదుగురిపై కేసు

చింతకాని, ఆగస్టు 12: మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో భూవివాదానికి సంబంధించి ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపిన వివరాల ప్రకారం.. ఆవుల తిరుపతిరావు, ఆయన భార్యపై పాతకక్షలు దృష్టిలో ఉంచుకుని ఆవుల శ్రీనివాస్, లింగయ్యతో పాటు మరో ముగ్గురు దాడి చేసి, అసభ్య పదజాలంతో దూషించారు. తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నకిలీ ఉద్యోగ నియామక ఉత్తర్వులు వైరల్!

● విచారణ చేపట్టిన ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 12: ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గానికి కనీస సమాచారం లేకుండా అధికారులే అక్రమంగా ఉద్యోగ నియామకాలకు తెర లేపారు. ఇదే అదునుగా భావించిన దళారులు ఏకంగా ఉద్యోగ నియామక పత్రాలను సృష్టించిన లేఖ ఖమ్మం నగరపాలక సంస్థలో సోమవారం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ లేఖ విషయమై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య విచారణ చేపట్టారు.

ఖమ్మం నగరానికి చెందిన నిరుద్యోగి ఇనమాల ఘనరత్నానికి తెలంగాణ ప్రభుత్వ మునిసిపల్ డిపార్టుమెంట్ పేరుతో ఈనెల 2న ఓ ఉద్యోగ నియామక పత్రాన్ని రాజు కమల్ సంతకంతో సెక్షన్ ఆఫీసర్ మునిసిపల్ డిపార్టుమెంట్ పేరుతో ఆర్డర్‌ను పంపారు. ఇందులో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం కోసం 11నెలల కాల పరిమితిని, ఉద్యోగ నిబంధనలను పొందు పరుస్తూ నియామక పత్రాన్ని తయారు చేశారు. నెలకు రూ.27,679 వేతనంతో పాటు ఇతర సదుపాయాలన్ని కల్పించారు. సెప్టెంబరు 9న మునిసిపల్ కార్యాలయంలో ఉద్యోగంలో చేరాలని మరీ ఆదేశించారు.

అయితే ఇలా ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామకపత్రాలు పంపారనే విషయంపై కేఎంసీలో చర్చనీయాంశమైంది. నకిలీ ఉద్యోగ నియామకపత్రంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి ఎటువంటి నోటిఫికేషన్లు ఇవ్వలేదని, నిరుద్యోగులు మోసపోవద్దని సూచించారు. నకిలీ ఉద్యోగ నియామకపత్రంపై విచారణ చేపట్టినట్లు తెలిపారు.

బ్రీత్ ఎనలైజర్‌పై అనుమానాలున్నాయని..

● అద్దె బస్సులను నిలిపి.. ఆందోళన చేసిన డ్రైవర్లు

మణుగూరు, ఆగస్టు 11: మణుగూరు ఆర్టీసీ డిపోలో బ్రీత్ ఎనలైజర్ సజావుగా పనిచేయడం లేదని మద్యం సేవించకపోయినా, మద్యం సేవించినట్లు రిపోర్టు చూపెడుతోందని ఆరోపిస్తూ సోమవారం డిపోలో నడిచే ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ప్రైవేట్ డ్రైవర్ యూనియన్ నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు కార్మికులతో మాట్లాడారు. ఈ క్రమంలో కొందరు కార్మికులు మూడు రోజులుగా బ్రీత్ ఎనలేజర్ వల్ల డ్రైవర్లను విధులు నిర్వహించకుండా డిపోలోనే నిలిపివేస్తున్నారని తెలిపారు.

కాగా ఈ విషయంపై డిపో మేనేజర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం విధులకు హాజరయ్యే కార్మికులందరినీ బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించిన తర్వాతే విధులకు పంపిచడం జరుగుతుందని తెలిపారు. అయితే సోమవారం ఆర్టీసీ పర్మినెంట్ కార్మికులంతా టెస్టులు చేయించుకున్నారు. కానీ అద్దె బస్సుల డ్రైవర్లు ఇందుకు నిరాకరిస్తూ, విధులను బహిష్కరించారన్నారు. ఎస్ఐ మేడ ప్రసాద్ మణుగూరు డిపోకు చేరుకుని డ్రైవర్లతో మాట్లాడారు. అప్పటికీ ఆందోళన కొనసాగుతుండడంతో సీఐ సతీష్ కార్మిక సంఘ నాయకులకు డిపో సిబ్బందికి, డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్‌పై తానే స్వయంగా ప్రయోగాత్మకంగా టెస్టును నిర్వహించుకొని, మిషన్ పనితీరుపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రైవర్లు బ్రీత్ ఎన్‌లైజర్ పరీక్షలు చేయించుకోని, బస్సు సర్వీసులను డిపో నుంచి నడిపించసాగారు.

ఆరు కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, ఆగస్టు 12: భద్రాచలంలోని ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరు కేజీల గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రహీమున్నీసాబేగం తెలిపారు. అలాగే నిందితులు గంజాయి రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ అల్లూరి సీతరామరాజు, కానిస్టేబుళ్లు ఆలీం, బాబు, వీరబాబు, లలిత, రాకేష్, మనోహర్, సుజాత పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న ఐదుగురి అరెస్టు

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఆగస్టు 12: గంజాయి తాగుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, నిర్ధారించి అరెస్టు చేసినట్లు కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సోమవారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 10న ద్విచక్ర వాహనంపై లక్ష్మీదేవిపల్లి మండలంలోని శేషగిరినగర్ పంచాయతీకి చెందిన రావులపెంట మోహన్ కృష్ణ 6.69 కేజీల గంజాయిని తీసుకొని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో నిర్మానుష్య ప్రాంతంలో కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకొని గంజాయిని గుర్తించడంతో పాటు అతడిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు. నిందితుడు చెప్పిన సమాచారం మేరకు.. ఏపీలోని చింతూరులో ఈ గంజాయిని కొనుగోలు చేసి కొత్తగూడెంలోని నిర్మానుష్య పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవించే వారికి అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో గంజాయి తీసుకున్న ప్రేమ్‌కుమార్, అమన్, సాదిక్ పాషా, రేవంత్, సందీప్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్ఐ విజయ, పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాలు చెప్పకపోతే జీతం ఆపేస్తాం

▸ నేలకొండపల్లి బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు డీఈవో హెచ్చరిక

నేలకొండపల్లి, ఆగస్టు12: ఏడో తరగతి విద్యార్థులకు గణితం సబ్జెక్టు చెప్పకపోతే జీతం ఆపి వేస్తామని డీఈవో సోమశేఖరశర్మ ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం నేలకొండపల్లి బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులకు గత 10 రోజులుగా గణితం సబ్జెక్టును బోధించేందుకు ఉపాధ్యాయులెవ్వరూ వెళ్లకపోవడంతో వివాదానికి దారితీసింది. ఫిజిక్స్, మాథ్స్ టీచర్లు తాము చెప్పమంటే...తాము చెప్పమని భీష్మించుకున్న సందర్భంలో ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి సమస్యను డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల తనిఖీకి వచ్చిన డీఈవో ఫిజిక్స్, మాథ్స్ ఉపాధ్యాయులను పిలవగా, సోమవారం ఫిజిక్స్ టీచర్ పాఠశాలకు హాజరుకాలేదు. మాథ్స్ టీచర్‌ను 7వ తరగతి విద్యార్థులకు సబ్జెక్టు చెప్పాలని ఆమెను ఆదేశించారు. కాగా సదరు ఉపాధ్యాయురాలు పాఠాలు చెప్పాలని తమ జాబ్‌ఛార్ట్‌లో లేదని, ప్రభుత్వం ఇచ్చిన జీవోలో సైతం లేదని డీఈవోకు సమాధా నం చెప్పినట్లుగా సమాచారం. అయితే నేను చెబుతున్నాను...తరగతి తీసుకోవాల్సిందే అని డీఈవో ఆదేశించారు. మంగళవారం నుంచి 7వ తరగతి విద్యార్థులకు లెక్కల క్లాస్ తీసుకోకపోతే ఫిజిక్స్, మాథ్స్ ఉపాధ్యాయుల జీతాలను నిలిపివేయాలని ప్రధానోపాధ్యాయురాలిని ఆదేశించినట్లుగా తెలుస్తున్నది. అనంతరం విద్యార్థుల సామార్థ్యాన్ని పరీక్షించారు. పాఠశాలలోని వంట గదిని పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, సింగారెడ్డిపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో సోమశేఖర్‌శర్మ

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

పాల్వంచ, అగస్టు 12: భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన ధరావత్ ఓం ప్రకాష్ కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకొని భార్య ధరావత్ రమాదేవి అతడిని నిలదీసింది. దీంతో అతను ఆమెపై కక్ష పెంచుకుని, ఆమెను మానసికంగా, శారీరకంగా హిసించసాగాడు. తరచూ ఆమెను దుర్భాషలాడుతూ భౌతిక దాడికి పాల్పడుతున్నాడు. భర్త వేధింపులను భరించలేక ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ, అగస్టు 12: ఆర్థిక ఇబ్బందులు తాళలేక రోజువారీ కూలీ క్రిమి సంహారక మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పాల్వంచ పట్టణ పరిధిలోని వనమా కాలనీకి చెందిన కోటిపల్లి సత్యప్రసాద్(31) రోజువారీ కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం శ్రీనివాసకాలనీ ముర్రేడువాగు సమీపంలో క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం తన భార్య రోజాకు ఫోన్ చేసి అదే విషయాన్ని తెలియజేశాడు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న ఆమె స్థానికులతో కలిసి అతడిని పాల్వంచ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించింది. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, మృతుడి భార్య రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఎరువుల అడ్డగింత

గుండాల/ఆళ్లపల్లి, ఆగస్టు 12: రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాల్సిన వ్యవసాయ పరపతి సంఘంలో కొందరు పెట్టుబడిదారుల పరపతితో రైతులకు అందాల్సిన ఎరువులు పక్కదారి పట్టిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం స్థానిక పీఏసీ కార్యాలయం తెరవకముందే ట్రాక్టర్‌లో వంద బస్తాల ఎరువులు లోడ్‌చేసి ఉండటం గమనించిన రైతులు ట్రాక్టర్‌కు అడ్డంగా బైటాయించారు. రైతులు రోజంతా క్యూలో నిలబడిన ఐదు కట్టలు ఇవ్వడం లేదని ఆరోపించారు. అలాంటిది ఒకే వ్యక్తికి వంద బస్తాల ఎరువులు ఎలా ఇస్తారని ప్రశ్నించడంతో ఖంగుతిన్న అధికారులు ట్రాక్టర్‌లోని బస్తాలను కిందికి దింపారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఉమ్మడి మండలంలో ఒకే పీఏసీఎస్ ఉండటంతో ఆళ్లపల్లి మండలంలో తీగలంచ వద్ద మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కాగా ఎరువుల కోసం వచ్చిన రైతుల దగ్గర ముందుగా ఆధార్ కార్డులు సేకరించి పెట్టుకొని, సాయంత్రం ఎరువులు పంపిణీ చేస్తామని చెప్పి సిగ్నల్ లేదంటూ ఆధార్ కార్డులను గోదాం ఆవరణలో పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వ్యాపారులకు కొమ్ముకాస్తు వ్యాపారుల గోదాంలలోకి తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆధార్, వేలిముద్రలు వేయకుండా పెట్టుబడిదారుల ద్వారా రూ.300 తీసుకుంటున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. జిల్లా అధికారులు పీఏ సీఏస్‌లో జరుగుతున్న అక్రమాలను నిగ్గుతెల్చి రైతుకు ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు అందించాలని కోరుతున్నారు.

మహిళ మృతి: కేసు నమోదు

ఖమ్మం క్రైం ఆగస్టు 12: ఒంటరిగా ఉంటున్న మహిళ మృతిపై ఖమ్మం పోలీస్‌స్టేషన్‌ నందు సోమవారం రాత్రి కేసు నమోదైంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి ప్రాంతానికి చెందిన గుర్రాల కాశీవిశాలాక్షి(40) అను ఒంటరి మహిళ నాలుగేళ్లుగా నగరంలోని శ్రీకృష్ణ నగర్ రోడ్ నెంబర్-4లో నివాసం ఉంటూ టైలరింగ్ చేస్తుంది. కొంతకాలంగా ఒంటరిగా ఉంటున్న ఆమె మానసికంగా తీవ్ర వేదనకు గురవుతుంది. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మందులు వాడుతుంది. కాగా సోమవారం ఉదయం తన నివాసం ఉంటున్న గది తలుపులు తీయకపోవడంతో ఇంటి యజమాని కిటికీలోంచి చూశాడు. దీంతో ఆమె కిందపడిపోయి ఉండటం గమనించి, తలుపులు పగలగొట్టి వచ్చి చూడగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మరణం తట్టుకోలేక భర్త మృతి

● విప్పలమడక గ్రామంలో ఘటన


నర్సింహారావు, సరోజిని దంపతులు(ఫైల్)

వైరా, ఆగస్టు 12: భార్య మరణాన్ని భరించలేక మనోవేదనతో రెండు రోజులకే భర్త కూడా మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని విప్పలమడక గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన భార్యభర్తలు వజినేపల్లి సరోజిని(72), నర్సింహారావు(77)లు మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న సరోజిని ఈ నెల 9న మృతి చెందింది. ఆమె అంత్యక్రియలను భర్త నర్సింహారావు బంధువులతో కలిసి పూర్తి చేశాడు. ఆయన కూడా అనారోగ్యంతోనే ఉన్నారు. భార్య మృతి చెందిన నాటి నుంచి తీవ్ర మనోవేదనతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ దంపతులకు నలుగురు కుమార్తెలున్నారు. వీరందరికీ వివాహాలు కూడా జరిగాయి. రెండురోజుల వ్యవధిలో దంపతులిద్దరూ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

భద్రాచలం ఆగస్టు 12: భద్రాచలం లో తాళంవేసిఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇరువురిని అరెస్టుచేసి నట్లు భద్రాచలం సీఐ సంజీవరావు సోమవారం ఎందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు వివరిం చారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని ఇంటిలో, జగదీశ్ కాలనీలో మరో ఇంటిలో తాళం పగలగొట్టి దొంగతనాలకు పాల్పడిన భద్రాచలంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మాలోత్ విక్రమ్, సుందరయ్యనగర్ కు చెందిన విజీవన్‌ప్రకాశ్ లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇద్దరు కలిసి తాళం వేసివున్న ఇళ్లను ఎంచుకొని రాత్రి సమయంలో దొంగతనం చేసి వాటిని అమ్ముకొని వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారని తెలిపారు. వారిని సోమవారం పట్టుకొని వారి దగ్గరనుంచి సమారుగా ఎనిమిది తులాల బంగారం, ఇరవై తులాల వెండి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. దీనిలో మొదటి వ్యక్తి అయిన మాలోత్ విక్రమ్ పైన గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటుగా మహబూబాబాద్ జిల్లాలోను పలతు దొంగతన కేసులు నమోదుఅయ్యాయని తెలిపారు. ఆ ఇద్దరినీ అరెస్టుచేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. అధికారులు, సిబ్బందిని సీఐ సంజీవరావు అభినందించారు.

ప్రహరి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

దమ్మపేట, ఆగస్టు 12: మండల పరిధిలోని గండుగుల పల్లి పంచాయతీ రెడ్యాలపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశా లకు నూతనంగా మంజూరైన ప్రహరీ గోడ పనులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాం గ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్య పటిష్ఠతకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి విజేతకు అభినందన

దుమ్ముగూడెం ఆగస్టు 12: అంతర్జాతీయ ఆదివాసీ దినో త్సవం సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో రెండో స్థానం సాధించిన నారాయణరావుపేట ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి కంగాల రాకేష్‌వర్ధన్‌ను పాఠశాల సిబ్బంది సోమవారం అభి నందించారు. ఆదివాసీ పండుగల ప్రాముఖ్యత, జరుపుకునే విధానం అనే అంశంపై పోటీ నిర్వహించారు. కలక్టర్, పీఓల చేతుల మీదుగా బహుమతి అందుకోవడంతో తమ పాఠశా లకు జిల్లా స్థాయి గుర్తింపు దక్కిందని హెచ్‌ఎం బట్టా నాగే శ్వరావు తెలిపారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

దుమ్ముగూడెం ఆగస్టు 12: ఉద్యోగాల క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ అమలు తదితర డిమాండ్లను నెరవే ర్చాలని కోరుతూ మండల తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యో గులు సోమవారం నల్లబ్యాడ్జీలతో ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పనిభారం, చాలీ చాలని వేత నాల నిరాశ, నిస్పృహలతో రాష్ట్రంలో అనేక మంది ఉద్యో గులు గుండెపోటుతో మృతిచెందారని, ఒక్క జూలై నెలలోనే నలుగురు మృత్యువాత పడ్డారని తెలిపారు. మృతిచెందిన ఉద్యోగుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. మండల అధ్యక్షుడు గుండి దుర్గారావు, కాక జయ రావు, కొమరం ముద్దరాజు, కల్లూరి తులసీరాం పాల్గొన్నారు.

మృతి చెందిన ఉద్యోగులకు నివాళులు

కరకగూడెం: సమగ్ర శిక్ష ఉద్యోగులుగా పనిచేస్తు మృతి చెందిన ఉద్యోగులకు సోమవారం సీఆర్‌పీల సంఘం మం డల అధ్యక్షుడు జయబాబు ఆధ్వర్యంలో నివాళులు అర్పిం చారు. ఎంఈవో కార్యాలయంలో మృతి చెందిన సమ గ్ర శిక్ష ఉద్యోగుల చిత్ర పటానికి వివాళులు అర్పించారు. గడిచిన నెలరోజుల్లోనే ఖమ్మం, రంగారెడ్డి నారాయణపేట,ఆదిలా బాద్ జిల్లాలో గుండెపోటుతో మృతి చెందారన్నారు. ప్రభుత్వంసమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు పిలుపుని స్తామని హెచ్చరించారు. సీఆర్‌పీలు సాంబశివరావు, విష్ణు మూర్తి, ఐఈఆర్‌పీ విజయకుమారి, కేజీబీవీ టీచింగ్ మౌనిక, వసుధ, నాన్ టీచింగ్ పార్వతి, రజిత పాల్గొన్నారు.

పల్లెల్లో విజృంభిస్తున్న విషజ్వరాలు..


చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

- అధ్వాన పారిశుధ్యం.. రోగాల మయం
- కిటకిటలాటుతున్న ఆసుపత్రులు
- శాఖల మధ్య సమన్వయలోపం..
- బ్లీచింగ్ లేదు..ఫాగింగ్ లేనేలేదు.
- రోగులను పట్టించుకోని వైనం..


వైద్యం కోసం వచ్చిన రోగులు

అశ్వారావుపేట/ రూరల్, ఆగస్టు 12: పల్లెల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతుంది..మారిన వాతావరణం..అధ్వాన పారిశుధ్యం.. కలుషిత నీరు వెరసి ప్రజలు రోగాలతో ఇబ్బందులు పడుతు న్నారు. ఏ పల్లెను కదిలించినా ఏమున్నది గర్వకారణం అనే రీతిన మురుగునీటి కాల్వలు, తాగునీటి కలుషితాలతో గిరి జనం విలవిలాడుతున్నారు. కొద్దిరోజులుగా పల్లెల్లో సీజనల్ వ్యాధులు ఊహించని విధంగా వస్తుంటే చర్యలు చేపట్టాల్సిన అధికారగణం చేతులెత్తేస్తుంది. పంచాయతీల్లో నిధుల కొరత, శాఖల మధ్య సమన్వయం కొరవడం వెరసి అనేక కారణా లతో ప్రజలు వ్యాధుల బారిన పడి ఎక్కడ ప్రాణాలు పోతాయో అంటూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని జీవిస్తు న్నారు. మండలంలో సీజనల్ వ్యాధుల నేపధ్యంలో అపరిశు భ్రత, అధికారులు నిర్లక్ష్యంపై ప్రత్యేక కథనం.

పంచాయతీల్లో పరిస్థితులు దారుణం

అశ్వారావుపేట మండలంలో 30 పంచాయతీలు ఉన్నాయి. గడిచిన పక్షం రోజులుగా మండలంలో ప్రతి గ్రామంలోనూ వ్యాధులు విజృంభించాయి. మండలంలోని దురదపాడు, రెడ్డి గూడెం, అశ్వారావుపేట, మొద్దులమడ, తిరుమలకుంట, బండారుగుంపు ఇలా ప్రతి గ్రామంలోనూ మలేరియా, టైఫా యిడ్ బాధితులు వందల సంఖ్యలోనే ఉన్నారు. జ్వరాలు విజృంభిస్తున్నా వైద్యులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెలో పారి శుధ్యం అధ్వానంగా తయారైంది. బ్లీచింగ్ చల్లి ఫాగింగ్ చేయాల్సి ఉన్నా అవి మచ్చుకు కూడా కనిపించటం లేదు. నిధుల కొరత అంటూ చిన్న చిన్న పనులు కూడా చేయని దుస్థితి పంచాయతీల్లో నెలకొంది.

శాఖల మధ్య సమన్వయలోపం..

గతంలో ప్రతి సంవత్సరం వ్యాధుల సీజన్‌లో పల్లెల్లో పక్షం నుంచి నెల రోజుల పాటు వివిధ రకాల పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమ న్వయంలో పనిచేసి కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇందుకు ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా నిధులను మంజూరు చేసే వారు. తద్వారా పంచాయతీల్లో తప్పనిసరిగా అందరూ కలిసి కట్టుగా ఉండి పనులు చేసేవారు. కాని ప్రస్తుతం పంచాయ తీల్లో ఆపరిస్థితి లేదు. పంచాయతీలకు పాలకులు లేకపోవ టంతో నిధులు విడుదల కావటంలేదు. దీంతో ఎటువంటి పనులు చేయటం లేదు. ఇది ఇలా ఉంటే పంచాయతీ, వైద్య శాఖతో పాటు ఇతర శాఖల సమన్వయంతో పల్లెల్లో పనులు చేపట్టాలి. కాని శాఖల మధ్య సమన్వయ లోపంతో పల్లెల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. పల్లెలకు ప్రత్యేక అధికా రులు ఉన్నా అధికశాతం మంది పంచాయతీలకు పోయిన దాఖలాలే లేవు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవటంతో ప్రజలు రోగాలతో బాధపడుతున్నా పట్టించుకునేవారే లేకుండా పోయారు.


గుర్రాలచెరువులో అధ్వానంగా ఉన్న చెత్తకుప్పలు

ఎవరిని కదిలించినా జ్వరమే

మండలంలో ఆ ఊరు ఈ ఊరు అనే తేడా లేకుండా ఎక్కడికి వెళ్లినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. అధ్వాన పారి శుధ్యం, సమన్వయలోపం, ప్రత్యేక శిబిరాలు లేకపోవటం వెరసి ఇంటింటా జ్వరాలే ఉన్నాయి. ఆర్థికంగా ఉన్నవారు ప్రైవేటుకు వెళుతుంటే పేదలు సర్కారు దవాఖాకు వస్తు న్నారు. రోగులతో అశ్వారావుపేట ఆసుపత్రి కిటకిటలాడు తుంది. రోజుల తరబడి ఆసుపత్రిలోనే ఉంటూ చికిత్సలు పొందుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

మండలంలోని ప్రతి గ్రామంలో జ్వరాలు బీభత్సంగ ఉన్నా యని, వైద్య సౌకర్యాలు, బ్లీచింగ్, దోమల మందు పిచికారి కూడ లేదని 'ఆంధ్రజ్యోతి'లో రెండు రోజుల క్రితం జ్వరాలతో పడకేసి పల్లెలుపై ప్రత్యేక కథనం ప్రచురితమైంది. కాని ఇప్పటి వరకు ఒక్క అధికారిగాని, ప్రజా ప్రతినిధిగాని పట్టిం చుకున్న దాఖలాలు లేవు. మలేరియా పీడిత గ్రామాలలో కూడ ఇంత వరకు దోమలమందు పిచికారి జరుగలేదు. జ్వరాలు వచ్చిన వారు రెండు వారాల పాటు మోకాళ్ళ నొప్పులు, వాపులతో ఇబ్బందులు పడుతున్నప్పటికి దానికి గల కారణాలను విశ్లేషించే పరిస్థితి లేదు. ఇప్పటికైౖ అధికారులు జనం గోడు పట్టించుకొని ప్రజలను జ్వరాల బారినుండి రక్షిం చాలని కోరుకుంటున్నారు.

దేవస్థానం ఉద్యోగులకు తాజాగా విధుల కేటాయింపు

- ఉత్తర్వులు జారీ చేసిన దేవస్థానం ఈవో

భద్రాచలం, ఆగస్టు 12: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని పరిపాలన విభాగంలో తాజాగా ఉద్యోగులకు విధుల కేటాయింపు జరిగింది. ఇటీ వల రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖలో జరిగిన సాధారణ బదిలీల్లో భద్రాద్రి దేవస్థానం నుంచి ఐదుగురు బదిలీ కాగా యాదాద్రి, వేములవాడల నుంచి ఐదుగురు భద్రాచలం దేవస్థానానికి వచ్చారు. పరిపాలన విభాగంలో కొత్తగా వచ్చిన, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు తాజాగా పలు కీలక బాధ్యతలను అప్పగిస్తూ దేవస్థానం ఈవో ఎల్.రమా దేవి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో దేవస్థానం లోని పరిపాలన విభాగంలో పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస రావు ప్రోటోకాల్, ప్రొవిజనల్ స్టోర్స్, ఆడిట్, సీఆర్‌వో, ప్రసాదం తయారీలను కేటాయించారు. పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాత, కొత్త గోశాల నిర్వహణ, క్లాత్ స్టోర్స్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. మరో పర్యవేక్ష కులు బి.కిషోర్‌కు సాధారణ, ఈఎంవోలు, ఆన్‌లైన్ బదిలీలు, ట్రస్టు బోర్డు, ఆర్టీఐ, రికార్డు గది, శాశ్వత అన్నదానం, అలాగే ప్రధాన ఉత్సవాలు, మాసోత్సవాలు, ప్రచార రథం, దత్తత ఆలయాలు, శ్రీరామదీక్ష, అన్నదానం పర్యవేక్షణ బాధ్యత లను అప్పగించారు. వేములవాడ నుంచి వచ్చిన నూతన పర్యవేక్షకులు వి.అరుణ్‌కుమార్‌కు క్యాష్‌బుక్, చెక్ రిజిష్టర్లు, పుస్తకాలు, లెడ్జర్ పోస్టింగ్, బ్యాంకు రిక్షలిసేషన్ , ఆదాయ పన్ను, చిట్టా, ఎఫ్‌డీఆర్, బంగారం, వెండి ఆభరణాల రిజి ష్టర్లు, చెక్కులు, డీడీల డిపాజిట్, మనియార్డరు, సెంట్రల్ స్టోరు బాధ్యతలు అప్పగించారు. సీనియర్ అసిస్టెంటు ఎ.శ్రీ నివాసరెడ్డి సీసీటూ ఈవోతో పాటు పరిపాలనవిభాగం, గోశాల, పారిశుధ్యానికి సంబంధించిన ఫైళ్ల నిర్వహణ చేయనున్నారు. యాదగిరి గుట్ట నుంచి వచ్చిన సీనియర్ అసిస్టెంటు ఎం.కృష్ణస్వామికి అవుట్‌సోర్సింగ్ ప్రయివేటు సెక్యూరిటీ జీతాలు, జనరల్ ట్రస్టుబోర్డు, ఆర్టీఐ, భూముల లీజు, అద్దెలు, లైసెన్సులు, న్యాయపరమైన అంశాల పర్యవేక్ష ణను అప్పగించారు. యాదగిరి గుట్ట నుంచి వచ్చిన సీని యర్ అసిస్టెంటు ఆర్.బాలాజీకి ప్రసాదం తయారీ, అన్న దానం విభాగం ఇన్‌చార్జిగా నియమించారు. జూనియర్ అసిస్టెంటు ఆర్ శ్రీకాంత్‌కు యాదగిరి గుట్ట నుంచి వచ్చిన సీనియర్ అసిస్టెంటుకు సహాయకుడిగా వ్యవహరించాలి. వీరితో పాటు ఇతర ఉద్యోగులకు పలు విభాగాలను కేటా యించారు.

సురేష్‌బాబు నేటితరం న్యాయవాదులకు ఆదర్శం: మంత్రి తుమ్మల


నివాళులర్పిస్తున్న తుమ్మల

కొత్తగూడె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది వట్టికొండ సురే ష్‌బాబు సేవలు అమోఘ మని ప్రజాసేవకు మారుపే రని ఆయన నేటితరం న్యాయవాదులకు ఆదర్శమం తుడని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది వట్టికొండ సురేష్‌బాబు సంతాపసభ సోమవారం కొత్తగూడెంలోని ఎన్‌కేనగర్‌లోని కమ్మసత్రంలో జరిగింది. ఈ సంతాప సభలో మంత్రి పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ నాయ కులు పోట్ల నాగేశ్వరరావు, కోనేరు సత్యనారాయణ, ప్రముఖ వైద్యులు రమేష్‌బాబు, తుశ్లూరు బ్రహ్మయ్య, బిక్కసాని నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, వాసిరెడ్డి మురళీ పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయాలి: ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

చుంచుపల్లి, ఆగస్టు 12: వైరాలో ఈ నెల 15న నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను జయప్రదం చే యాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. సోమ వారం విద్యానగర్ కాలనీలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నియోజక వర్గ ప్రజల రుణం తీర్చుకోవడం కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా నియోజకవర్గంలోని రైతాంగానికి తాగునీరు, సాగునీరు అందించాలని కోరినట్లు తెలిపారు. వైరాలో నిర్వహిస్తున్న, సభకు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తరలిరా వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ మాజీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఏను గుల అర్జున్‌రావు, కోనేరు చిన్ని, వూకంటి గోపాలరావు, నాగ సీతారాములు, ఎడవల్లి కృష్ణ, కొత్వాల శ్రీనివాసరావు, గుగులోతు కృష్ణ, రజాక్ గిడ్ల, పరంజ్యోతి రావు, అన్నోటి పాల్, తూము చౌదరి, కూచిపూడి జగన్, చింతలపూడి శేఖర్ పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఆగస్టు 12: రైల్వే కార్మికుల సమస్యలు పరిస్కరించాలని కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహిం చారు. సికింద్రాబాద్ డివిజనల్ అధ్యక్షుడు, బ్రాంచి కార్యదర్శి ఖాజాబాబా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల ప్రధాన సమస్యలను, డిమాండ్లను పరిష్కరించకుండా నిర్లక్ష్య ధోర ణిలో వ్యవహరిస్తూ కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెంక టేశ్వర్లు, పుల్లయ్య, ఓంకుమార్, పవన్, ఉదయ్, సంపత్, రవితేజ, మనోజ్, రవి, వెంకట్, గోపా లరావు పాల్గొన్నారు.

గొడ్డలి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బూర్గంపాడు, ఆగస్టు 12: గొడ్డలి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన సోమవారం బత్తునగర్‌లో చోటుచేసుకుంది. బూర్గంపాడు మండల పరిదిలోని బత్తులనగర్ గ్రామానికి చెందిన మడవి సీతయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కారం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. దాడితో తలకు తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడిని కుటుంబ భ్యులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడితో మాట్లాడి దాడికి గల కారణాలపై ఆరా తీశా రు. వ్యక్తిగత కక్ష్యాల నేపధ్యంలో దాడికి పాల్పడినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. బాధిత కుటుం బసభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిమ్మంపేట పాఠశాలలో చిత్రకళాపోటీలు

ములకలపల్లి, ఆగస్టు 12 : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు నిర్వహించిన చిత్రకళా పోటీలు, బహుమతి ప్రదానోత్సవం సోమవారం తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశా లలో ఉత్సాహకరమైన వాతావరణానికి వేదికైంది. కొల్లిఫౌండేషన్ ఆధ్వర్యంలో తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులకు చిత్రకళపోటీలు, బహుమతి ప్రదానోత్సవం జరిగింది. విజేతలకు కొల్లి ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు కల్పన చౌదరి, గ్రామ పెద్దలు తాండ్ర ప్రభా కర్ ఫౌండేషన్ సభ్యులు రుప్లానాయక్ చేతులమీదుగా బహుమతులు ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శంకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

సుజాతనగర్/అశ్వాపురం/ అశ్వారావుపేటటౌన్/భద్రాచలం /దుమ్ముగూడెం/మణుగూరు ఆగస్టు 12: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సఫాయి బంద్‌కు పిలుపునిచ్చారు. సీఐటీయు జిల్లా నాయకులు ఈ శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పదవులు కాపాడుకునే పనిలో కాంగ్రెస్ పాలకులు

- మాజీ ఎమ్మెల్యే మెచ్చా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

ములకలపల్లి, ఆగస్టు 12: ప్రజలను కాపాడే పనిలో కాంగ్రెస్ నాయకులు లేరని, పదవులు కాపాడుకునే పనిలో ఉన్నారని బీఆర్‌ఎస్ పార్టీ ఇన్ చార్జ్ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. సోమ వారం ములకలపల్లి మండ లంలో ఆయన పర్యటించారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మెచ్చా నాగేశ్వరరావు కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించిన ముత్యాలంపాడు, తాళ్లపాయి బ్రిడ్జిని పరిశీలించారు. అక్కడ ఉన్న గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్థుల సమస్యలను అధికారులకు తెలియచేసి పరిష్కరించాలని, అలాగే త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ములకలపల్లి పీహెచ్‌సీని సంద ర్శించారు. ప్రజలు జ్వరాలతో వచ్చినప్పటికీ 12గంటలైన డాక్టర్ లేకపోవడంతో అక్కడున్న సూపర్‌వైజర్‌తో మాట్లాడారు. డాక్టర్ ఇలా నిర్లక్ష్యంగా ఉండటం సరికాదని అన్నారు. అనం తరం శనగపాటి సీతారాములు నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు మాజీ సీఎం కేసీఆర్‌కి జీవితాంతం రుణపడి ఉండి చేసిన పనులను ప్రారంబించి మళ్లీ కేసీఆర్‌నే విమర్శించడం నేటి కాంగ్రెస్ పాలకులకు సరైన పద్ధతి కాదని అసలు కేసీఆర్‌ని విమర్శించే అర్హత ఏ మంత్రికి లేదన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మోరంపూడి అప్పారావు, మాజీ జడ్పీటీసీ మెహరమనీ, మాజీ సర్పంచ్ కుంజా నాగమణి, బీఆర్‌ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ తాటి ప్రవీణ్, పుష్పాల హనుమంతు, వెంకన్న, మాజీ సర్పంచ్ బైటి రాజేష్, తాటి రాజారావు, తానం కృష్ణ, పుష్పాల చందర్‌రావు, నర్సింహారావు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ముందున్న ఏఐఎస్‌ఎఫ్

ఇల్లెందు టౌన్, ఆగస్టు 12: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ముందుంటుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మగాని హరీష్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఎఐఎస్‌ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

పాల్వంచ రూరల్, ఆగస్టు 12: మండలంలోని ఉల్వనూరు పీహెచ్‌సీ సెంటరులో సోమవారం డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్ తనిఖీ చేశారు. స్థానిక వైద్యులు, సిబ్బందితో మాట్లా డారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడకుండ ముందుగానే మందులు పంపిణీ చేయాలని డీఎం అండ్‌హెచ్‌వో వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానికంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని చెప్పారు. మలేరియా, టైఫాయిడ్ పరీక్షలను నిర్వహించి తగిన మందులు రోగులకు అందజేయాలన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

అశ్వారావుపేట రూరల్: మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాలను నిర్వహిం చారు. ఆసుపాక, పాకలగూడెం గ్రామాల్లో శిబిరాలను జరి పారు. ఆయా శిబిరాల్లో జ్వరపీడితులకు, ఇతర వ్యాధిగ్రస్తు లకు వైద్యులు రాందాస్ నాయక్ పరీక్షలు జరిపారు. పరీక్షల్లో 15మంది జ్వరాలతో బాధపడుతున్నట్లుగా గుర్తించి మలే రియా, డెంగీ పరీక్షలు జరిపారు. రోగులకు అవసరమైన మందులు అందించారు. అనంతరం ఇంటింటికి తిరిగి దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శిబి రాల్లో హెల్త్‌సూపర్‌వైజర్ దుర్గ, హెల్త్‌అసిస్టెంట్ రవి, ఏఎ న్‌ఎం జయలక్ష్మీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జూలూరుపాడు: విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని గాంధీనగర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వర పీడితులకు రక్త నమూనాలను సేకరించి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' ప్రారంభోత్సవం పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వం

అశ్వాపురం ఆగస్టు 12: సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 15న సీతారామా ప్రాజెక్టును ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటం రైతులను మోసం చేయటమే నని సీపీఎం అనుబంధ తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్య దర్శి సాగర్ విమర్శించారు. సోమవారం సాగర్ నేతృత్వంలో రైతుసంఘం బృందం మండల పరిధిలోని కుమ్మరిగూడెం వద్ద ప్రాజెక్ట్ నిర్మాణాన్ని సందర్శించింది. ఆయన మాట్లా డుతూ సీతారామా ప్రాజెక్ట్ జిల్లా రైతుల చిరకాల వాంఛఅని, అటువంటి ప్రాజెక్ట్‌పనులు పూర్తికాకుండానే ప్రారంభించ టంలో అర్థం లేదన్నారు. జిల్లా అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై రైతులను సమీకరించి నీటి విడుదలను అడ్డు కుంటామన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎలమంచలి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారా యణ, సహాయకార్యదర్శి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు, నాయకులు సర్గం బాలన ర్సయ్య, సుధాకర్‌రెడ్డి, భద్రయ్య, నర్సింహరావు పాల్గొన్నారు.

కాలినడకన కాబాయాత్ర

- ఇల్లెందు నుంచి ప్రారంభించిన ముస్లిం యువకుడు



ఇల్లెందు టౌన్, ఆగస్టు 12 : పవిత్ర సౌదీఅరేబియాకు కాలినడకన కాబా యాత్రను ఇల్లెందు పట్టణంలోని నెంబర్-2బస్తీకి చెందిన ముస్లిం యువకుడు అబ్దుల్ హబీద్ శ్రీకారం చుట్టారు. ఈ యాత్రను సోమవారం నెంబర్-2బస్తీలోనే గఫూర్యా మజీద్ వద్దనుంచి ప్రారంభించారు. ఐదు రాష్ట్రాలు, మూడు దేశాల్లో 9వేల కిలోమీటర్ల పొడవున 10నెలలపాటు ఈ సుదీర్ఘ పవిత్ర పాదయాత్ర సాగుతుందని హబీద్ తెలిపారు. ఐదు రాష్ట్రాలు దాటుకుని పంజాబ్‌లోని వాగా సరిహద్దు వద్ద భారతదేశం నుంచి పాకిస్తాన్‌లోకి ప్రవేశించి పాకిస్తాన్ నుంచి ఇరాన్ ఇరాక్‌ల ద్వారా సౌదీఅరేబియాకు చేరుతుందని ప్రకటించారు. కాలినడక యాత్ర సందర్భంగా అబ్దుల్ హబీద్‌కు మద్దతు పలుకుతూ ఇల్లెందు పట్టణంలో ముస్లీం యువకులు, మతపెద్దలు ర్యాలీ నిర్వహించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హబీద్ మాట్లాడుతూ పవిత్రమైన కాబాయాత్రను చేపట్టాలనే దృఢసంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. విశిష్టమైన కాలినడ కన సాగే కాబాహజ్‌యాత్ర విజయవంతం అవుతుందని ఆకాంక్షించారు.

మంత్రుల పర్యటనలో అన్నీ తానై..

- భోజనం వడ్డించిన మంత్రి తుమ్మల

పాల్వంచ రూరల్, ఆగస్టు 12: మండలంలోని కిన్నెరసాని జలాశయాన్ని సందర్శించేందుకు సోమవారం వచ్చిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలకు అన్ని తానై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భోజనం వడ్డించారు. టూరిజం అభివృద్ధి పర్యాటనలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు కిన్నెరసానికి చేరుకున్నారు. మధ్యాహ్నం బోటులో కిన్నెరసాని జలాశయంలోకి వెళ్లారు. బోటులోనే భోజన ఏర్పాట్లు చేశారు. మంత్రి తుమ్మల డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులకు అన్నం వడ్డించారు. అంతా తానై భోజనాలు పెట్టి ఆయన వారితో కలిసి భోజనం చేశారు.


ఎమ్మెల్యేలకు భోజనం వడ్డిస్తున్న మంత్రి తుమ్మల


మంత్రి తుమ్మలకు స్వాగతం పలుకుతున్న కొత్వాల

టూరిజం శాఖాధికారులపై తుమ్మల అసంతృప్తి

కిన్నెరసాని జలాశయం వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టూరిజం అధి కారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనకు వచ్చిన ప్రజాప్రతినిధు లకు తగిన సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయ్యారని అసంతృప్తి చెందారు. పర్యటన టూరు ముందుగానే ఖరారైందని, టూరిజం అధికారులకు తెలియచేసిన ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం వహించారని మంత్రి అన్నారు.

మంత్రి తుమ్మలకు స్వాగతం పలికిన కొత్వాల

మండలంలోని కిన్నెరసాని పర్యాటక కేంద్రానికి సోమవారం విచ్చేసిన వ్యవ సాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్‌కమిటీ మెంబరు కొత్వాల శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ఈ కార్యక్ర మంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు వై. వెంకటేశ్వర్లు, పైడిపల్లి మహేష్, రాము, చిరంజీవి, శాంతివర్ధన్ పాల్గొన్నారు.

బడ్జెట్ హోటల్ అందుబాటులోకి వచ్చేవరకు విశ్రమించను

- అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు మంజూరు చేయాలి
- మంత్రులతో కలిసి కిన్నెరసాని, బడ్జెట్ హోటల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం పుణ్యక్షేత్రం, కిన్నెర సాని పర్యాటక కేంద్రాన్ని సందర్శించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే వారికి, జిల్లా ప్రజలకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో ప్రభుత్వం ఆధ్వర్యంలో బడ్జెట్ హోటల్ (హరిత హోటల్) నిర్మించాలన్న నా ఆలోచనే ఇల్లెందు క్రాస్ రోడ్డులో సిద్ధమవుతున్న బడ్జెట్ హోటల్ అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసాయం రఘురాంరెడ్డితో కలిసి సోమవారం పాల్వంచ కిన్నెరసాని పర్యాటక కేంద్రాన్ని, ఇల్లెందు క్రాస్ రోడ్డులోని బడ్జెట్ హోటల్‌ను ఆయన సందర్శించారు. ఎమ్మెల్యే అప్పటి పర్యాటకశాఖ మంత్రితో సంప్రదిం పులు జరిపిన ప్రతిపాదించిన ఫలితంగా గత యూపీఏ ప్రభుత్వ బడ్జెట్ హోటల్‌ను మంజూరు చేసిందని మంజూరైన బడ్జెట్ హోటల్ తాజా, మాజీ పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు అందుబాటులోకి రాలేదని, కోట్లాది రూపా యలు వెచ్చించిన నిర్మాణాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. తాను మంజూరు చేయించిన హోటల్‌ను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రభు త్వంపై ఒత్తిడి చేసిన ఫలితంగా ఇటీవల మంజూరైన రూ. 5కోట్లతో పనులు జరుగుతున్నాయని, పనుల పరిపూర్తికి మరిన్ని నిధులు కేటాయించాలని రాష్ట్ర పర్యాటక మంత్రిని కోరినట్లు తెలిపారు. కిన్నెరసాని అద్దాల మేడ వరకు అసం పూర్తిగా ఉన్న సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ప్రాజెక్టుకు రిటైనింగ్ వాల్, 500 ఎకరాల్లో జులాజికల్ పార్కు, నదిపై సస్పెన్షన్ వంతెన, ఐలాండ్‌ను ఆహ్లా దంగా కేంద్రంగా తీర్చిదిద్దాలని, సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, కిన్నెరసాని నుంచి మణుగూరు వరకు టైగర్ రెస్క్యూ కారిడార్ ఏర్పాటు చేయాలని తది తర ప్రతిపాదనలను పర్యాటకశాఖ మంత్రి జూపెల్లితోపాటు ఇతర మంత్రుల ముందు ఉంచినట్లు తెలిపారు. తన ప్రతిపాదనలపై సానుకూల స్పందన లభించినట్లు తెలిపారు. కిన్నెరసాని ప్రాజెక్టులు జాతీయస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే వరకు, హరిత హోటల్‌ను ప్రజలకు అందుబాటులో కితెచ్చే వరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. వీరి వెంట జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, వివిధశాఖల ఉన్నతాధికారులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గసభ్యులుముత్యాల విశ్వ నాథం, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, పాల్వంచ మండలన పట్టణ కార్యదర్శులు వి. పూర్ణచందర్‌రావు, సాయిబాబు తదితరులు ఉన్నారు.


డిప్యూటీ సీఎంకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని